




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 12 సంచిక : 208 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శుక్రవారం 3 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :208 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM FRI 3 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# ఇక అమరావతికి తిరుగులేదు..
# రాష్ట్రానికి కొత్త శకం మొదలైంది

- రాజ్యసభలోనూ ఆమోదం పొందిన అమరావతి బిల్లు
- అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తించిన పార్లమెంట్
- ఇది చారిత్రక ఘట్టమని అభివర్ణించిన సీఎం చంద్రబాబు
- ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాకు ప్రత్యేక కృతజ్ఞతలు
- రైతుల త్యాగాలకు దక్కిన గౌరవమని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:రాజ్యసభలో గురువారం అమరావతి బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక చారిత్రక, నిర్వచనాత్మక ఘట్టమని సీఎం చంద్రబాబు నాయు డు అభివర్ణించారు. అమరావతికి తిరుగులేదని, అది ఆంధ్రప్రదేశ్ హృదయమని, భవిష్యత్తులో దేశానికే గర్వకారణంగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, 2026 పార్లమెంట్ ఉభయ సభల్లో ఏకగ్రీవంగా ఆమోదం పొందడం ద్వారా ప్రజల సమష్టి ఆకాంక్షలకు జాతీయ స్థాయిలో బలమైన గొంతుక లభించిందని చంద్రబాబు పేర్కొన్నారు. "రాష్ట్ర విభజన తర్వాత రాజధాని లేకుండా ఆంధ్రప్రదేశ్ అనేక సవాళ్లు, అనిశ్చితులను ఎదుర్కొంది. ఈ క్లిష్ట సమయంలో అమరావతి రైతులు చేసిన అసమానమైన త్యాగం, చూపిన విశ్వాసం, కనబరిచిన ధైర్యమే ఈ కలను సజీవంగా నిలిపాయి. ఈ చారిత్రక విజయం వారికే అంకితం," అని ఆయన అన్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్రానికి దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న స్థిరత్వం లభించిందని, ప్రతి పౌరుడికి సాధికారత, ఆత్మవిశ్వాసం, ప్రగతితో కూడిన కొత్త శకానికి నాంది పలికిందని తెలిపారు. "అమరావతి రాజధాని హోదా ఇప్పుడు ఎలాంటి సందేహాలకు, చర్చలకు, మార్పులకు తావులేకుండా పటిష్టంగా స్థిరపడింది" అని ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్ర ఆకాంక్షలకు అండగా నిలిచిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి చంద్రబాబు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 2015 అక్టోబర్ 22న అమరావతికి శంకుస్థాపన చేసిన నాటి నుంచి, 2025 మే 2న దాని పురోగతికి పునరుజ్జీవం పోసే వరకు ప్రతి కీలక దశలోనూ ప్రధాని మోదీ అమరావతికి అండగా నిలిచారని కొనియాడారు. ఈ బిల్లు ముందుకు సాగడంలో కీలక పాత్ర పోషించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు, కేంద్ర ప్రభుత్వానికి కూడా ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. విభేదాలను పక్కనపెట్టి అమరావతిని ఏకైక 'ప్రజా రాజధాని'గా పునరుద్ఘాటించిన అన్ని పార్టీలు, పార్లమెంట్ సభ్యులకు చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం రాజ్యసభలో ఈ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించినట్లు సభాధ్యక్షులు సి.పి. రాధాకృష్ణన్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఎన్డీయే సభ్యులు హర్షధ్వానాలు చేశారు. దీంతో అమరావతి ఆంధ్రప్రదేశ్ ఏకైక, శాశ్వత రాజధానిగా చట్టబద్ధమైన గుర్తింపు పొందింది.



## అమెరికా లొంగిపోయేవరకు యుద్ధం కొనసాగుతుంది

- ఇరాన్ నౌకాదళం, వాయుసేన తీవ్రంగా బలహీనపడ్డాయన్న ట్రంప్
- ట్రంప్ చెప్పినట్లు తమ సైనిక సామర్థ్యాలను దెబ్బతినలేదన్న ఇరాన్
- మా ఆయుధ సంపత్తి గురించి అమెరికాకు సమాచారం లేదన్న ఇరాన్

పెన్ పవర్ డెస్క్:అమెరికా తమకు లొంగిపోయేవరకు ఈ యుద్ధం కొనసాగుతుందని ఇరాన్ హెచ్చరించింది. ఇరాన్ నౌకాదళం, వాయుసేన తీవ్రంగా బలహీనపడ్డాయని, వారి నాయకత్వాన్ని తీవ్రస్థాయిలో

మిగతా 2లో



## అమరావతి చట్టబద్ధత బిల్లుకు రాజ్యసభ ఆమోదం.. వాకౌట్ చేసిన వైసీపీ

- అమరావతికి చట్టపరమైన భరోసా కల్పిస్తూ చట్టసవరణ బిల్లు
- రాజ్యసభలో చర్చ అనంతరం బిల్లుకు ఆమోదం
- ఇప్పటికే లోక్ సభలో బిల్లుకు ఆమోదం

పెన్ పవర్ డెస్క్:అమరావతి చట్టబద్ధత బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టపరమైన భరోసా కల్పిస్తూ ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టసవరణ బిల్లుకు రాజ్యసభలో కూడా ఆమోదం లభించింది. మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం తెలిపింది. ఇప్పటికే ఈ బిల్లుకు లోక్ సభ ఆమోదం తెలిపింది. ఈరోజు రాజ్యసభలో చర్చ అనంతరం ఆమోదం తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి ఈ బిల్లుపై చర్చను ప్రారంభించారు. బిల్లుపై చర్చ సమయంలో వైసీపీ ఎంపీలు వాకౌట్ చేశారు. రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందిన అనంతరం రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఏపీ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అమరావతికి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీర్వాదం ఉంటుందని అన్నారు. కాగా, రాష్ట్రపతి ఆమోదం అనంతరం ఇది చట్టంగా మారనుంది. సభలో 11 పార్టీలకు చెందిన 17 మంది ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. పది పార్టీలకు చెందిన ఎంపీలు మద్దతిచ్చారు.



## భారత నౌకలకు డోకా లేదు..

### హర్మూజ్ జలసంధిపై ఇరాన్ కీలక ప్రకటన

- హర్మూజ్ జలసంధిలో భారత నౌకల భద్రతపై ఆందోళన వద్దన్న ఇరాన్
- ఇజ్రాయెల్, అమెరికాతో ఉద్రిక్తతల నేపథ్యంలో జలసంధిపై ఆంక్షలు
- ఇప్పటివరకు 8 భారత నౌకలను సురక్షితంగా బయటకు పంపిన ఇరాన్
- భారత్‌కు రావాల్సిన మరో 19 నౌకలు ఇంకా జలసంధిలోనే చిక్కుకుపోయిన వైనం
- భారత్, చైనా, రష్యా వంటి మిత్ర దేశాలకు మాత్రమే అనుమతిస్తున్నట్లు ప్రకటన

మిగతా 2లో

## రాజధానికి పట్టిన గ్రహణం వీడింది..

### ఇంటింటా దీపాలు వెలిగించి సంబరాలు జరుపుకుందాం: మంత్రి నారా లోకేశ్

- అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్లో బిల్లుకు ఆమోదం
- ఇంటింటా దీపాలు వెలిగించి సంబరాలు జరుపుకోవాలని లోకేశ్ పిలుపు
- #APThanksIndia హ్యాష్‌ట్యాగ్‌తో పోస్టులు పెట్టాలని సూచన
- రాజ్యసభలో బిల్లు పాసయ్యాక ఎంపీలతో మంత్రి లోకేశ్ భేటీ
- రాష్ట్రపతి ఆమోదం తర్వాత గెజిట్ విడుదల చేయనున్న కేంద్రం

పెన్ పవర్ డెస్క్:ఏపీ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టపరమైన హామీ లభించింది. ఈ మేరకు ప్రవేశపెట్టిన ఏపీ పునర్విభజన చట్ట సవరణ బిల్లుకు పార్లమెంట్ ఉభయ సభలు ఆమో దముద్ర వేశాయి.

మిగతా 2లో






## నాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు కృషి చేశారు

### తెలంగాణ బీజేపీ ఎంపీ

- విభజన తర్వాత అమరావతి రాజధానిగా సంకల్పం తీసుకున్నారన్న లక్ష్మణ్
- రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఎన్డీయే కట్టుబడి ఉందన్న లక్ష్మణ్
- జగన్ హయాంలో మూడు ముక్కలాడి రైతులు, మహిళలను ఇబ్బంది పెట్టారని మండిపాటు

మిగతా 2లో





## హర్మూజ్ మార్గం పునరుద్ధరణే లక్ష్యం.. 35 దేశాలతో భేటీకి భారత్ హాజరు

- హర్మూజ్ జలసంధి సంక్షోభంపై యూకే ఆధ్వర్యంలో 35 దేశాల సమావేశం
- ఈ కీలక భేటీకి భారత్‌ను ఆహ్వానించిన యునైటెడ్ కింగ్‌డమ్
- వర్చువల్ సమావేశానికి హాజరుకానున్న భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ
- ఇప్పటికే 6 భారత నౌకలు సురక్షితంగా జలసంధిని దాటాయని తెలిపిన విదేశాంగ శాఖ
- మిత్రదేశాలు సొంతంగా పోరాడాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు


మిగతా 2లో

## ఉద్యోగులకు రూ.7,358 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదలకు గ్రీన్ సిగ్నల్

- ఏ మాత్రం నిధుల లభ్యత ఉన్నా పెండింగ్ బిల్లులను చెల్లించాలని ముఖ్యమంత్రి ఆదేశం
- బిల్లుల చెల్లింపుల్లో చిన్న కాంట్రాక్టర్లకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి సూచన
- పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఆర్థిక శాఖ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష

పెన్ పవర్ డెస్క్:గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన పెండింగ్ బిల్లుల చెల్లింపులపై గురువారం ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఆర్థిక శాఖపై సమీక్షించారు. ఈ మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యో గుల పెండింగ్

మిగతా 2లో






## చరిత్రలో ప్రజా రాజధానిగా అమరావతి గుర్తుంటుంది

పెన్ పవర్ డెస్క్:తెలుగు ప్రజలందరికీ చరిత్రాత్మకమైన రోజు అని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. చరిత్రలో ప్రజా రాజధానిగా అమరావతి గుర్తుంటుందని చెప్పారు. రాజ్యసభలో అమరావతికి చట్టబద్ధత బిల్లును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ ప్రవేశపెట్టారు. అనంతరం చర్చకు ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ అనుమతించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడారు. "అమరావతికి చట్టబద్ధత బిల్లు ప్రవేశపెట్టడాన్ని తెలుగు ప్రజలంతా గర్వంగా భావిస్తున్నారు. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవడం మా నాయకుడు నేర్పించారు. ఏపీ రాజధాని గురించి

మిగతా 2లో

## హైదరాబాద్ సహా పలు నగరాల్లోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు



- ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ కార్యాలయాల్లో ఏకకాలంలో ఈడీ సోదాలు
- బెంగాల్ బొగ్గు స్మగ్లింగ్ కేసుకు సంబంధించి ఈడీ సోదాలు
- గతంలో బెంగాల్‌లోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# భావజాలాన్ని అంతమొందించలేరు...!

నక్సలైట్ ఉద్యమం ముగింపు దినం 2026 మార్చి 31. అంటే దేశంలో కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో సాయుధ పోరాటం చేస్తున్న ఒక సిద్ధాంత పార్టీని నిర్మూలించాలనే కేంద్ర ప్రభుత్వ సంకల్పం దినం. ఈ కాలంలో వేలాది మావోయిస్టులు, పోలీసులు, నిర్భాగ్యులైన ఆదివాసీలు మరణించారు. ఈ ఆరు దశాబ్దాలలో మావోయిస్టు ఉద్యమం చాలా పొందింది, చాలా కోల్పోయింది. దినిని ఎవరూ నిరాకరించలేరు.

మార్క్సిస్టు–లెనినిస్టు, మావోయిస్టు సిద్ధాంతం బలంతో ప్రారంభమైన నక్సల్బరి ఉద్యమం క్రమంగా దేశమంతటా వ్యాపించింది. దీనికి ప్రధాన కారణం – కులం, మతం పేరుతో పేద వర్గాలపై ఉన్నత వర్ణాలు, పెట్టుబడిదారులు, సామంతుల అణచివేత, అన్యాయం, అత్యాచారాలు. మావోయిస్టు ఉద్యమం పేద, సర్వహారా వర్గాలపై జరుగుతున్న, చేస్తున్న అణచివేత, అన్యాయం, అసమానత, అత్యాచారాలు చేస్తున్న వారిని గుర్తించేలా చేసింది. స్వతంత్ర దేశ ప్రభుత్వాలు దీనిని సరిగ్గా గుర్తించి ఉంటే, ఇపుడు వేలాది, లక్షలాది మావోయిస్టులు, పోలీసులు, నిర్భాగ్యులైన ఆదివాసీలు చనిపోయేవారు కాదు. అణచివేత, అన్యాయం, అసమానత, అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు నక్సలైట్ ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. వేలాది మంది యువకులు ఈ ఉద్యమంలో చేరారు. ప్రజలను చైతన్యపరిచారు. ఆదివాసీలకు విద్యాబోధన చేసి, అనేక రకాల శిక్షణలు ఇచ్చారు. ప్రారంభంలో పోలీసులు, నక్సల్ వాదుల మధ్య పెద్ద శత్రుత్వం ఏమీ లేదు. నక్సలైట్లు గ్రామాల్లో సామంత వర్గాలకు వ్యతిరేకంగా తమ ఉద్యమాన్ని తీవ్రం చేశారు. దీన్ని చూసి సామంతులు ప్రభుత్వాలను సంప్రదించారు. ప్రభుత్వం సామంతుల భద్రత కోసం గ్రామాల్లో పోలీసులను పంపి నక్సలైట్లను తమ లక్ష్యంగా చేసుకుంది. ఇదే సమయంలో దేశంలో పెరుగుతున్న నక్సలైట్ ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రజాస్వామ్య ప్రభుత్వం నిషేధం విధించింది. దీన్ని చూసి నక్సలైట్లు తమ భద్రత కోసం ఆదివాసీ ప్రాంతాలకు వెళ్లి, ఖనిజ సంపద, ప్రకృతిని కాపాడేందుకు కృషి చేయడం ప్రారంభించారు. పెట్టుబడిదారులు, పెద్ద కంపెనీల ధనబలంతో రాజ్యాంగం మీద ప్రమాణం చేసి మళ్లీ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం పెట్టుబడిదారుల, పెద్ద కంపెనీల కోసం మావోయిస్టులను అడవుల నుంచి తరిమేందుకు ఆపరేషన్ కగార్ ప్రారంభించింది. దీని ఫలితంగా పెద్ద ఎత్తున వేలాది మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపివేయబట్టారు. కొంత మంది మావోయిస్టు నాయకులు లొంగిపోయారు. ఈ ప్రక్రియకు ముందు మావోయిస్టుల వైపు నుంచి అనేక శాంతి ప్రతిపాదనలు వచ్చాయి. అయినప్పటికీ, ప్రభుత్వం అన్ని ప్రతిపాదనలను తోసిపుచ్చింది, లొంగిపోండి లేదా ఎన్‌కౌంటర్‌లో చనిపోండి అని ప్రతిపాదన చేసింది. దేశాన్ని రక్షించే సైన్యాన్ని ఆధునిక ఆయుధాలతో తమ సొంత పౌరుల మీద దాడి చేసింది. దేశంలో ఇప్పటికీ అనేక మంది నక్సలైట్లు అడవుల్లో, జైళ్లలో ఉన్నారు. మావోయిస్టు పార్టీ అగ్ర నాయకుడు గణపతి ఇప్పటికీ అజ్ఞాతంలో ఉన్నారు. ఇదే సమయంలో ఒడిశా ఎమ్ఏడీసీ విభాగం కార్యదర్శి రజితా సాయుధ పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. పార్టీ కోసం ప్రాణాలు త్యాగం చేసిన సహచరుల మరణం వృధా పోనివ్వమని ఆమె చెప్పారు. మావోయిస్టుల సాయుధ పోరాటం ప్రతీ హింస కోసమేనని అందరికీ తెలుసు. దేశ, ప్రపంచ పౌరులు మంచి ప్రత్యామ్నాయ ప్రభుత్వం కోసం వెతుకుతున్నారు. ప్రతి ఒక్కరూ మార్పు కోరుకుంటున్నారు. ఈ మార్పు మావోయిస్టు భావజాలం ద్వారా సాధ్యమవుతుంది. మావోయిస్టు భావజాలం ఇప్పటికీ ప్రజల్లో సజీవంగా ఉంది, భవిష్యత్తులో కూడా ఉంటుంది

# రాజధానికి పట్టిన గ్రహణం వీడింది..

- మొదటి పేజి తరువాయి

ఈ చారిత్రాత్మక పరిణామం నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు జరుపుకోవాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. దీంతో రాష్ట్ర ప్రజలు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. ఈ విషయంపై మంత్రి నారా లోకేశ్ ఎక్స్ (శ) వేదికగా స్పందిస్తూ... "రాజధానికి పట్టిన గ్రహణం వీడి, ప్రజా రాజధానికి చట్టబద్ధత లభించింది" అని హర్షం వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకుని నేడు రాత్రి 7 గంటలకు ప్రతి ఇంటి ముందు దీపాలు వెలిగించి వేడుకలు జరుపుకోవాలని ప్రజలను కోరారు. దీపాలతో సెల్ఫీ తీసుకుని 'మన రాజధాని మన గౌరవం' అంటూ చూాూఘ్లుఅ౦×అఙ్ఖ హ్యాష్‌ట్యాగ్‌తో సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని సూచించారు. బిల్లుపై చర్చ జరిగిన సమయంలో రాజ్యసభ గ్యాలరీ నుంచి లోకేశ్ ప్రక్రియను పర్యవేక్షించారు. బిల్లు ఆమోదం పొందాక, దీనికి సహకరించిన పలు పార్టీల ఎంపీలను ఆయన నేరుగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం రాజ్యసభ క్యాంటీన్‌లో వారితో భేటీ అయ్యారు. గురువారం రాజ్యసభలో ఈ బిల్లుపై దాదాపు రెండు గంటల పాటు చర్చ జరిగాక ఆమోదం లభించింది. తదుపరి ప్రక్రియలో భాగంగా కేంద్ర కేబినెట్ దీనికి పోస్ట్ ఫ్యాక్టో ర్యాటిఫికేషన్ చేసి, రాష్ట్రపతి ఆమోదానికి పంపనుంది. రాష్ట్రపతి ఆమోదం తర్వాత కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడంతో అమరావతికి చట్టబద్ధత ప్రక్రియ పూర్తవుతుంది.

# భారత నౌకలకు డోకా లేదు..

ఇజ్రాయెల్, అమెరికాతో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో కీలకమైన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలపై ఆంక్షలు విధించిన ఇరాన్.. భారత్‌కు కీలక హామీ ఇచ్చింది. "భారత మిత్రులకు ఎలాంటి ఆందోళన అవసరం లేదు. వారు సురక్షితంగా ఉన్నారు" అని భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం గురువారం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రకటించింది. ఈ భరోసాతో భారత్ కాస్త ఊపిరి పీల్చుకుంది.

ప్రపంచంలోని 20 శాతం ఇంధన రవాణా జరిగే హర్మూజ్ జలసంధి ఇరాన్ నియంత్రణలో ఉంది. ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్, అమెరికాతో వివాదం మొదలైనప్పటి నుంచి ఇరాన్ ఈ మార్గంలో రాకపోకలను దాదాపు నిలిపివేసింది. అయితే భారత్, చైనా, రష్యా, ఇరాక్, పాకిస్థాన్ వంటి స్నేహపూర్వక దేశాల నౌకలను మాత్రమే అనుమతిస్తున్నట్లు ఇరాన్ స్పష్టం చేసింది. ఈ దిగ్బంధనం వల్ల భారత్ సహా పలు దేశాలకు ఇంధన సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇప్పటికే 8 భారత నౌకలు హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటాయి. వీటిలో దీఔ ర్=, దీఔ జూవీ అనే రెండు ఎల్‌పీజీ క్యారియర్లు ఉన్నాయి. వీటి ద్వారా సుమారు 94,000 టన్నుల ఎల్‌పీజీ భారత్‌కు చేరింది. అయితే, భారత్‌కు రావాల్సిన ఎల్‌పీజీ, ముడిచమురు, ఎల్ఎన్‌జీతో కూడిన మరో 19 నౌకలు ఇంకా అక్కడే చిక్కుకుపోయాయని అధికారులు తెలిపారు.

ఇటీవల జరిగిన

మంత్రిత్వ శాఖల సమావేశంలో షిప్పింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా ఈ వివరాలు వెల్లడించారు. చిక్కుకున్న నౌకల్లో భారత్‌కు చెందినవి 9 ఉండగా, విదేశీ జెండాలతో భారత్‌కు వస్తున్నవి 10 ఉన్నాయని ఆయన వివరించారు. ఈ సంక్షోభం కారణంగా మొత్తం 500 నౌకలు జలసంధిలో నిలిచిపోయినట్లు సమాచారం.

# నాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు కృషి చేశారు

దూరదృష్టి గల నాయకుడిగా ఆనాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబునాయుడు కృషి చేశారని, విభజన తర్వాత ఏపీకి అమరావతి రాజధానిగా సంకల్పం తీసుకుని ముందుకు సాగుతున్నారని తెలంగాణ బీజేపీ నాయకుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. అమరావతికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారని, రెండు రాష్ట్రాల అభివృద్ధికి ఎన్డీయే కట్టుబడి ఉందని అన్నారు. అమరావతి చట్టబద్ధత బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం వికసిత్ రాజధాని అవసరమని ఆయన అన్నారు. రాజధాని అమరావతి కోసం 29 వేలమంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని గుర్తు చేశారు. భవ్య రాజధాని కోసం ఏపీ ప్రజలు కలలు కన్నారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్పం సాకారమయ్యేందుకు వికసిత్ ఆంధ్ర నిర్మాణం అవశ్యమన్నారు. రాజధాని అవసరమని, కానీ జగన్ తన హయాంలో మూడు ముక్కలాడి రైతులు, మహిళలను ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. రాజధాని కోసం చాలాకాలంగా పోరాడిన మహిళలకు, రైతులకు ఆయన శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. అమరావతి బిల్లు కోసం దేశం మొత్తం ఆసక్తిగా చూస్తోందని అన్నారు. తెలుగు వారికి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలని నాడు పొట్టి శ్రీరాములు 58 రోజులు నిరాహార దీక్ష చేసినా, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించలేదని మండిపడ్డారు. ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన ప్రాణాలు త్యాగం చేశారని అన్నారు. ఆయన మరణానంతరం ప్రభుత్వం స్పందించి ఆంధ్ర రాష్ట్రం ఇచ్చిందని అన్నారు.

# హర్మూజ్ మార్గం పునరుద్ధరణే లక్ష్యం.. 35 దేశాలతో భేటీకి భారత్ హాజరు

ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో ఇరాన్ మూసివేసిన హర్మూజ్ జలసంధి సంక్షోభం అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన ఈ మార్గాన్ని తిరిగి తెరిపించేందుకు యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) నడుం బిగించింది. ఇందులో భాగంగా 35 దేశాలతో నిర్వహిస్తున్న అత్యవసర సమావేశానికి భారత్‌ను కూడా ఆహ్వానించింది. గురువారం వర్చువల్‌గా జరిగే ఈ భేటీలో భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ పాల్గొంటారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ధ్రువీకరించారు. భారత ఇంధన భద్రతకు హర్మూజ్ జలసంధి అత్యంత కీలకం. దేశం దిగుమతి చేసుకునే ముడి చమురులో 40శాతం, ద్రవీకృత సహజ వాయువు (ాచీ+)లో 50శాతం, ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ూా+)లో 80శాతానిపైగా ఈ మార్గం గుండానే రవాణా అవుతుంది. ఈ నేపథ్యంలో భారత నౌకల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఇరాన్‌తో పాటు ఇతర సంబంధిత దేశాలతో చర్చిస్తున్నామని జైస్వాల్ తెలిపారు. ఈ చర్చల ఫలితంగానే గత కొన్ని రోజుల్లో ఆరు భారత నౌకలు సురక్షితంగా జలసంధిని దాటగలిగాయని ఆయన వివరించారు. ఈ సంక్షోభంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనూహ్యంగా స్పందించారు. గతంలో జలసంధిని తెరిపించడం తన ప్రాధాన్యత అని చెప్పిన ఆయన, బుధవారం తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ప్లేటు ఫిరాయించారు. "మీ చమురు మీరే తెచ్చుకోండి. మీ కోసం మీరు పోరాడటం నేర్చుకోండి. అమెరికా ఇకపై మీకు సహాయం చేయదు" అంటూ యూకే వంటి మిత్రదేశాలకు ఆయన సూచించారు. ఇరాన్‌ను ఇప్పటికే దెబ్బతీశామని, కష్టమైన భాగం పూర్తయిందని ట్రంప్ పేర్కొన్నారు.

మరోవైపు యూకే ప్రధాని కీర్ స్టార్మర్ మాత్రం ఈ విషయంలో వెనక్కి తగ్గలేదు. ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, యూఏఈ సహా 35 దేశాలు సముద్ర భద్రత పునరుద్ధరణకు కలిసి పనిచేయడానికి అంగీకరించాయని

ప్రకటించారు. నౌకాయాన స్వేచ్ఛను పునరుద్ధరించడం, చిక్కుకుపోయిన నౌకలు, సిబ్బంది భద్రతను పటిష్టం చేయడం, కీలక సరుకుల రవాణాను తిరిగి ప్రారంభించడం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. యూకే విదేశాంగ కార్యదర్శి వైవెట్ కూపర్ అధ్యక్షతన జరిగే ఈ భేటీ అనంతరం, తదుపరి కార్యాచరణపై అధికారులు చర్చిస్తారని సమాచారం.

# హైదరాబాద్ సహా పలు నగరాల్లోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు

పశ్చిమ బెంగాల్‌లో బొగ్గు స్మగ్లింగ్ కేసుకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ ప్రముఖ రాజకీయ కన్సల్టెన్సీ ఐప్యాక్ కార్యాలయాల్లో సోదాలు చేపట్టింది. హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీలోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఏకకాలంలో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. ప్రశాంత్ కిషోర్‌కు చెందిన ఐప్యాక్ ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తోంది. ఐప్యాక్ కన్సల్టెన్సీ డైరెక్టర్లలో ఒకరైన రిషిరాజ్ సింగ్‌కు చెందిన ప్రాంగణంపై కూడా దర్యాప్తు సంస్థ దృష్టి సారించింది. బొగ్గు స్మగ్లింగ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కొంతకాలంగా సోదాలు జరుగుతున్నాయి. గతంలో బెంగాల్‌లోని ఐప్యాక్ కార్యాలయాలు, ఐప్యాక్ అధినేత ఇళ్లలో ఈడీ సోదాలు నిర్వహించింది. నాడు సోదాల సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వయంగా అక్కడకు వచ్చి, మీడియా ఎదుటే ఫైళ్లతో వెళ్తూ కనిపించడం చర్చకు దారితీసింది. సోదాల సమయంలో బెంగాల్ ప్రభుత్వం నుంచి ఆటంకాలు ఎదురయ్యాయని ఈడీ అప్పుడు ఆరోపించింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. మరోవైపు, మమతా బెనర్జీ కేంద్ర దర్యాప్తు సంస్థ ఆరోపణలను ఖండించింది. సోదాల పేరుతో ఈడీ తన పరిధిని ఉల్లంఘించిందని ఆరోపించారు.

# అమెరికా లొంగిపోయేవరకు యుద్ధం కొనసాగుతుంది

- మొదటి పేజి తరువాయి

దెబ్బతీశా మని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ ధీటుగా స్పందించింది. ట్రంప్ చెప్పినట్లుగా తమ సైనిక సామర్థ్యాలు దెబ్బతినలేదని పేర్కొంది. అమెరికా అవమానానికి గురై, పశ్చాత్తాపపడి, లొంగిపోయే వరకు ఈ యుద్ధం కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ మిలిటరీ కమాండ్ ప్రధాన కేంద్రం అధికార ప్రతినిధి ప్రకటన చేయగా, ఇరాన్ అధికారిక మీడియా ప్రసారం చేసింది. తమ దేశ సైనిక బలం, విస్తృతమైన వ్యూహాత్మక సామర్థ్యాల గురించి అమెరికా నిఘా వర్గాలకు పూర్తి సమాచారం లేదని పేర్కొంది. వ్యూహాత్మక క్షిపణులు, సుదూర లక్ష్యాలను ఛేదించే డ్రోన్లు, అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలు, ప్రత్యేక ఆయుధాల ఉత్పత్తి కేంద్రాలతో పాటు సైనిక మౌలిక సదుపాయాలు ధ్వంసం చేశామని ట్రంప్ చేసిన వాదనలను ఇరాన్ ఖండించింది. అమెరికా రాతి యుగం నాటి నేరాలను ఆధునిక యుగానికి తీసుకువస్తోందని ఆరోపించింది. చిన్నారుల హత్యలు, మానవత్వానికి మచ్చతెచ్చే నేరాలకు పాల్పడుతోందని ఆరోపించింది.

# ఉద్యోగులకు రూ.7,358 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదలకు గ్రీన్ సిగ్నల్

- మొదటి పేజి తరువాయి

బిల్లుల చెల్లింపులపై ఆరా తీశారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులు జరపాలని గతంలో ఇచ్చిన ఆదేశాలను ఏ మేరకు అమలు చేశారని అడిగారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు కసరత్తు చేశామని, నిధుల లభ్యతను బట్టి చెల్లింపులను జరుపుతున్నామని అధికారులు వివరించారు.

ఉద్యోగులకు రిలీఫ్ ఇచ్చేలా మొత్తంగా రూ.7,358 కోట్ల మేర పెండింగ్ బిల్లుల విడుదలకు చర్యలు తీసుకున్నామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. దీంట్లో భాగంగా ఇప్పటికే ప్రావిడెంట్ ఫండ్ బకాయిల కింద రూ.1,848 కోట్లను నేరుగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేశామని, అలాగే గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్ కింద 4,793 మందికి సంబంధించిన రూ.76 కోట్ల చెల్లింపులు కూడా పూర్తి చేశామని వెల్లడించారు. వీటితో పాటు గ్రాట్యుటీ బకాయిల కింద రూ.3,411 కోట్లు, పెండింగులో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కింద రూ.1,800 కోట్లు, పోలీస్ శాఖకు సంబంధించి అదనపు సరెండర్ లీవుల నిమిత్తం రూ.223 కోట్ల బిల్లుల విడుదల ప్రక్రియ కొనసాగుతోందని మరో రెండు రోజుల్లో చెల్లింపులు పూర్తి చేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు. తల్లికి వందనం తర్వాత ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో చెల్లింపులు జరుపుతోంది ఉద్యోగులకు మాత్రమేనని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. నిధుల లభ్యతను బట్టి ఉద్యోగుల పెండింగ్ బిల్లుల సహా అన్ని రకాల పెండింగ్ బిల్లులకు చెల్లింపులు జరపాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల విషయంలో జరిగిన పరిణామాలు ప్రస్తావనకు వచ్చాయి. నాడు ఉద్యోగుల సొంత సొమ్మును కూడా నాటి ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించడంతో వారు తీవ్ర ఇబ్బందులుపడ్డారని, తమ నిధుల కోసం ప్రశ్నించిన నేతలపై కేసులు పెట్టి వేధించారనే అంశం చర్చకు వచ్చింది. ఇదే సమీక్షా సమావేశంలో వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లకు, మెటిరియల్ సరఫరా చేసిన వారికి జరపాల్సిన చెల్లింపులపైనా ముఖ్యమంత్రి ఆరా తీశారు. వివిధ శాఖలకు మెటీరియల్ సరఫరా చేసిన చిన్న చిన్న కాంట్రాక్టర్లకు రూ.614 కోట్ల బకాయిల చెల్లింపులు జరిపామని అధికారులు తెలిపారు. పనులు చేసిన, మెటిరీయల్ సరఫరా చేసిన వాళ్లకు బిల్లులు చెల్లింపులు జరిపే ప్రక్రియలో చిన్న కాంట్రాక్టర్లకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# చరిత్రలో ప్రజా రాజధానిగా అమరావతి గుర్తుంటుంది

- మొదటి పేజి తరువాయి

ప్రజలకు స్పష్టత ఇస్తున్నాం. విభజన సమయంలో ఒక రాష్ట్రానికి రాజధాని ఉంది.. మరో రాష్ట్రానికి అలా లేకుండా వదిలేయడంతో సమస్య మొదలైంది. విభజనకు వ్యతిరేకం కాదు కానీ.. జరిగిన విధానం సరిగా లేదు. రాష్ట్ర విభజన దేశంలో తొలిసారి జరగలేదు. వాజ్‌పేయీ హయాంలో 3 రాష్ట్రాలు ఏర్పడ్డాయి. అప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విభజన జరిగింది. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి రూ.16వేల కోట్ల రెవెన్యూ లోటు ఉంది. 5 కోట్ల మంది ఏపీ ప్రజలు సీఎం చంద్రబాబు వైపు ఆశగా ఎదురుచూశారు. తెలుగు ప్రజలకు ఆయన ఎన్నో ఆకాంక్షలు, విజన్ కల్పించారు. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకుని ముందుకెళ్లారు. రాజధాని నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భూములిచ్చారు. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం మూడు రాజధానుల నాటకమాడింది. రాజధాని అమరావతి కోసం ఉద్యమించిన రైతులను తీవ్రంగా హింసించారు. గర్భిణులు అని కూడా చూడకుండా లాఠీలతో కొట్టించారు. అమరావతి మహిళలకు సాష్టాంగ

నమస్కారం చేస్తున్నా. 2014లోనే అసెంబ్లీలో అమరావతిపై ఏకగ్రీవ తీర్మానం జరిగింది. చరిత్రలో ఏ రాజధాని చూసినా నదీ తీర ప్రాంతాల్లోనే విలసిల్లాయి. కృష్ణా నది తీరంలో అమరావతి నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఐకానిక్, వరల్డ్ క్లాస్ రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది" అని రామ్మోహన్‌నాయుడు అన్నారు.

# కలెక్టరేట్‌లో కొత్త కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

## ప్రజా సేవల్లో వేగం పెంచాలని ఆదేశాలు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 02 :** జిల్లాకు నూతనంగా నియమితులైన కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ గురువారం ఉదయం కలెక్ట రేట్ కార్యాలయంలోని అన్ని విభాగాలను ఆక స్మికంగా పరిశీలించారు. బాధ్యతలు స్వీకరించి న వెంటనే కార్యాలయ పనితీరును సమీక్షించిన ఆయన, ప్రతి సెక్షన్‌ను స్వయంగా సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు.విభాగాల వారీగా అధికారులతో, సిబ్బందితో మాట్లాడిన కలెక్టర్, పనుల పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ము ఖ్యంగా 24 గంటల కంట్రోల్ రూమ్‌ను సందర్శిం చి అక్కడ జరుగుతున్న ప్రక్రియలను పరిశీలిం చారు. ప్రజల నుంచి వస్తున్న ఫోన్ కాల్స్ స్వభా వం, ఫిర్యాదుల నమోదు విధానం, రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు.అనంతరం ఆర్డీవో కార్యాలయాన్ని సందర్శించిన ఆయన, ప్రజలకు సులభంగా గుర్తించేందుకు కార్యాలయ బోర్డు మరింత పెద్దగా ఏర్పాటు చేయాలని సూచిం చారు. అలాగే డీఎస్వో కార్యాలయం, హడ్కో భవనం నిర్మాణ పనులు, స్ట్రాంగ్ రూమ్, కలెక్టర్ పేషీ తదితర ప్రాంతాలను కూడా పరిశీలించారు.

పరిశీలన సందర్భంగా కలెక్టరేట్ కారిడార్‌లో ఉన్న వృద్ధులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వారు సమర్పించిన ఫిర్యాదు ల ప్రతులను పరిశీలించి సంబంధిత అధికారుల కు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించా రు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజ లను అనవసరంగా ఎక్కువసేపు వేచి ఉండని వ్వకూడదని, వారి సమస్యలకు తక్షణ స్పందన ఇవ్వాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత గడువులో పరిష్కరించ డం ప్రతి అధికారికి బాధ్యత అని స్పష్టం చేశా రు. ప్రతి ఒక్కరు తమ పనిని సమర్థంగా ని ర్వహిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించా లని సూచించారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవో సుధాసాగర్, కలెక్టర్ ఏవో బీవీ రాణి తదితర అధికారులు పాల్గొన్నారు.




పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# పక్కా ప్రభుత్వ భూమిలో.. నకిలీ పట్టాతో ఆక్రమణ?

**జీవీఎంసీ అనుమతులపై అనుమానాలు, స్థానికుల్లో ఆందోళన!**

**1978 పట్టా... ఇప్పటికీ ఖాళీ స్థలం!**

**నకిలీ పట్టాతో ఆక్రమణ చేశారనే ఆరోపణలు!**








పెందుర్తి, ప్రకాశ్‌నగర్‌లో వివాదాస్పద నిర్మాణం

పెందుర్తి మండలం, జీవీఎంసీ జోన్-8, వార్డ్ నెం.96 పరిధిలోని ప్రకాశ్‌నగర్ ప్రాంతంలో ఒక నిర్మాణానికి సంబంధించి వివాదం తీవ్రరూపం దాల్చుతోంది. డోర్ నెం.15-46/1, సర్వే నెం.123/2లో ప్రతిపాదిత ఆర్‌సిసి భవన నిర్మాణానికి జీవీఎంసీ అనుమతులు ఇవ్వడం ఇప్పుడు అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ నిర్మాణ స్థలం ప్రభుత్వ భూమిగా ఉండటంతో ఆక్రమణ ప్రయత్నం జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**1978 పట్టా... ఇప్పటికీ ఖాళీ స్థలం:**

ఈ భూమి 1978లో ఎన్జీవోలకు ప్రభుత్వంచే పట్టా ఇవ్వబడినదని సమాచారం. అయితే అప్పటి నుండి ఇప్పటి వరకు అక్కడ ఎటువంటి నిర్మాణాలు జరగలేదు. స్థానికుల ప్రకారం, అసలు పట్టాదారుడు మరణించగా, ఆయనకు వారసులు లేరని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ పట్టాను ప్రభుత్వం రద్దు చేసి భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ, అది జరగలేదని ఆరోపిస్తున్నారు.

**నకిలీ పట్టాతో ఆక్రమణ ఆరోపణలు :**

ఇటీవల ఈ స్థలంలో నిర్మాణానికి ప్రయత్నాలు ప్రారంభమవడంతో వివాదం చెలరేగింది. మరొకరికి చెందిన భూమిగా చూపిస్తూ నకిలీ పట్టా సృష్టించి, నిర్మాణం చేపట్టేందుకు యత్నిస్తున్నారని ఎన్జీవోస్ ఏరియా సంఘం సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై 35 మంది సంతకాలతో స్థానిక ఎమ్మెల్యేకు వినతిపత్రం కూడా సమర్పించారు.

**ఎమ్మెల్యే హామీ... కమ్యూనిటీ హాల్ డిమాండ్**

ప్రభుత్వ భూమి కావడంతో, ఈ స్థలంలో ఎన్జీవోలకు కమ్యూనిటీ హాల్ నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. ఎన్నికల ముందు ఎమ్మెల్యే పంచకర్ల దీనిపై హామీ ఇచ్చినట్టు స్థానికులు చెబుతున్నారు. అయినప్పటికీ, ప్రస్తుతం ప్రైవేట్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం అనుమానాలకు దారి తీస్తోంది.

**హౌస్ ట్యాక్స్ విధింపు కూడా ప్రశ్నార్థకం:**

ఏ నిర్మాణం లేని ఖాళీ స్థలంపై హౌస్ ట్యాక్స్ విధించడం కూడా వివాదాస్పదమైంది. కేవలం ఐడీ బాండ్ ఆధారంగా పన్ను విధించారని తెలుస్తోంది. అంటే గతంలో ఆ స్థలములో ఎటువంటి నిర్మాణాలు లేవు కాబట్టే ఐడి బాండ్ తో అప్పటికప్పుడు టాక్సు వేయించుకొని, జీవీఎంసీ ఆన్లైన్ అనుమతులకు వెళ్లారని విశ్వసనీయ సమాచారం. దీనిపై ఎటువంటి ఎంక్వయిరీ చేయకుండా ఐడి బాండ్ తో టాక్స్ వెయ్యడంపై నిర్లక్ష్యమా? లేక ఉద్దేశపూర్వక చర్యనా అన్న సందేహాలు అధికారులపై వ్యక్తమవుతున్నాయి.

**రాజకీయ ప్రభావం ఆరోపణలు:**

ఈ వ్యవహారంలో స్థానిక ఎమ్మెల్యే అనుచరుడు కీలక పాత్ర పోషిస్తున్నాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెందుర్తిలో 'షాడో ఎమ్మెల్యే'గా వ్యవహరిస్తున్న ఈ వ్యక్తి రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి "ఇది మన పరిధిలోని విషయం" అంటూ జోక్యం చేసుకోవద్దని హెచ్చరించినట్టు సమాచారం. అదేవిధంగా, ఈ వ్యవహారంలో స్థానిక ప్రజాప్రతినిధులకు మరియు కొంతమంది మీడియా ప్రతినిధులకు చేతుల మీదుగా డబ్బులు పంచినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**మునుపటి ప్రయత్నాలు అడ్డుకున్న అధికారులు:**

గతంలో కూడా డూప్లికేట్ పట్టాతో నిర్మాణానికి ప్రయత్నాలు జరిగాయని, అప్పటి ఎమ్మార్వో మరియు ప్రస్తుత ఎమ్మార్వో వాటిని అడ్డుకున్నారని రెవెన్యూ వర్గాలు తెలిపాయి. అయినప్పటికీ, మళ్లీ అదే ప్రయత్నాలు కొనసాగడం, నిర్మాణం చక చక సాగిపోవడం అధికార వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

**జీవీఎంసీ అనుమతులపై సందేహాలు :**

బి.ఏ.నెం:1086/2079/బి/జెడ్8/ఈజిఈ/2024 ప్రకారం స్టిల్ట్, గ్రౌండ్, మొదటి, రెండవ అంతస్తులతో నివాస భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వబడినట్టు తెలుస్తోంది. యజమాని ఏలిశెట్టి లక్ష్మి పేరుతో ఈ అనుమతులు జారీ కావడం, పక్కనే ప్రభుత్వ భూమి ఉండటం, పాత భవనం తొలగింపు వంటి అంశాలు సమగ్ర విచారణకు గురికావాల్సిన అవసరం ఉందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**స్థానికుల్లో ఆగ్రహం... విచారణకు డిమాండ్:**

ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి, నకిలీ పట్టాలు, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూమిని రక్షించి, ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారుల స్పందన కోసం స్థానికులు ఎదురుచూస్తున్నారు.

# డిజిటల్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి...




**చీపురుపల్లి పెన్ డ్రైవర్ ఏప్రిల్ 2 ..** డిజిటల్ మోసాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని విజయనగరం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ పిలుపునిచ్చారు. గురువారం నాడు చీపురుపల్లి సర్కిల్ కార్యాలయంలో ప్రజా సహకారంతో నిర్మించిన నూతన సర్కిల్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేకించి రిటైర్డ్ ఉద్యోగులు డిజిటల్ అరెస్టులు డిజిటల్ మోసాలకు భయపడి ఎక్కువ శాతం గురవుతున్నారు అన్నారు. ఫోన్ కాల్స్ ద్వారా అరెస్టు చేస్తామంటూ భయపెట్టిన వారిని నమ్మకుండా అవసరమైతే 1974 నెంబర్ కు ఫోన్ చేసి పోలీసులు సహకారం తీసుకోవాలన్నారు. జిల్లాని గంజాయి రైతు జిల్లా గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ప్రజలు గంజాయి, మార్కద్రవ్యాలు, మత్తు పదార్థాల వాడకంలో పూర్తి వ్యతిరేకతను కనబరచాలన్నారు,. కుటుంబంలో ఒక వ్యక్తి మార్గ ద్రవ్యాలకు బానిసైతే ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందని ఈ సందర్భంగా వివరించారు. ప్రత్యేకించి యువత గంజాయి మార్గ ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో అనుమానస్పద వ్యక్తులు సంచరించి ఇటువంటి వ్యాపారాలు కొనసాగిస్తే పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు. అదేవిధంగా వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకొని హెల్మెట్లు ధరించాలన్నారు. హెల్మెట్లు ధరించని కారణంగా సుమారు జిల్లాలో 200 మంది మృత్యువాత పడ్డారని ఈ సందర్భంగా ఆయన వివరించారు. అమ్మ జన్మనిస్తే హెల్మెట్ పునర్జన్మనిస్తుందని నినాదంతో జిల్లా వ్యాప్తంగా చర్యలు చేపడుతున్నామని ఈ సందర్భంగా ఆయనవారించారు. సైబర్ క్రైమ్ పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఇటువంటి ఫోన్ కాల్స్ కు భయపడకుండా సమీప పోలీస్ స్టేషన్లో సమాచారం అందజేసి తగిన సహకారం తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయనవారించారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి డిఎస్పి ఎస్ రాఘవులు, సర్కిల్ ఇన్స్పెక్టర్ జి శంకర్రావు, ఇంచార్జ్ ఎస్సై లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# వెన్నుముక బాధిత కుటుంబాన్ని ఆదుకున్న బొత్స అనూష ..

**చీపురుపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 2 .**చీపురుపల్లి పట్టణానికి చెందిన అన్నపూర్ణ కాలనీలో దువ్వారి సాయి కృష్ణ కుటుంబానికి మాజీ బొత్స సత్యనారాయణ కుమార్తె బొత్స అనూష గురువారం నాడు పరామర్శించి తమ వంతు సహకారాన్ని అందజేశారు. దువ్వారి సాయికృష్ణ వ్యాధి తో బాధపడుతూ కడుపేదరకాన్ని అనుభవిస్తున్న పరిస్థితిని పత్రికల ద్వారా తెలుసుకొని ఆమె పరామర్శించి మూడు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులను అందజేశారు. వెన్నుముక బాధితులకు పిల్లలు ఎవరూ లేకపోవడంతో పాటు సొంతగృహం కూడా లేకపోవడం వలన వైద్య ఖర్చులకు కూడా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో పత్రికలో వచ్చిన కథనాలకు ఆమె స్పందించారు. గత మూడు సంవత్సరాల నుంచి వెన్నెముక సమస్యతో బాధపడుతున్నారు. ఆయన సంపాదించిన సొమ్ము అంత విశాఖపట్నం, హైదరాబాదులో చికిత్స తీసుకున్నందున ఖర్చు కాగా ఆయన అప్పుల పాలు కావడంతో తన వంతు సహకారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రచార అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు , మండల పార్టీ అధ్యక్షులు వరహాల నాయుడు ,యువ నాయకులు బెల్లాన వంశీ కృష్ణ ,బెల్లాన త్రినాధ్ , బమ్మిడి కార్తీక్ , గిరిడి రామదాసు, కోరుకొండ దాలయ్య, గవిడి సురేష్, కర్రోతు ప్రసాద్, కంచుపల్లి అశోక్, బోడసింగి సత్యం, శివ, కృష్ణ ప్రభాత్, ,వెంకటరమణ, రాంకీ మరియు పట్టణానికి చెందిన ఎంపీటీసీలు ,వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.



# మాజీ వర్తక సంఘం అధ్యక్షుడు తిప్పల చిన అప్పారావు ఆరవ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు





**గాజువాక : పెన్ పవర్, ఏప్రిల్ 02:** పారిశ్రామిక ప్రాంతం గాజువాక వర్తక సంఘం మాజీ అధ్యక్షుడు, పెదగంట్యాడ ఆటోనగర్ వర్కర్స్ యూనియన్ మాజీ అధ్యక్షుడు తిప్పల చిన్న అప్పారావు 6వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి, పేదలకు వస్త్రాలు పంపిణీ చేసిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరి కమిటీ సభ్యుడుతిప్పల నాగిరెడ్డి , మాజీ శాసనసభ్యుడు తిప్పల గురుమూర్తి రెడ్డి , గాజువాక నియోజకవర్గం సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్ రెడ్డి , తిప్పల నితీష్, పెద్ద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 86 వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన: పల్లా



**కూర్మన్నపాలెం: పెన్ పవర్, ఏప్రిల్ 02:** జీవీఎంసీ 86 వ వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు,ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు .దువ్వాడ ఫ్లై ఓవర్ బ్రిడ్జి క్రింద 4 కోట్ల ఖర్చుతో 60 కి పైగా అదునాతన కంటైనర్ షాపింగ్ క్యాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విధ్వంసకర విధానాలు వలన రాష్ట్రము తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికి అభివృద్ధి,సంక్షేమం జోడెడ్ల బండి వలె డబుల్ ఇంజన్ సర్కార్ కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు .దీనిలో భాగంగానే ఎన్నికలు ముందు మనం ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తూనే ఇటువంటి అదనపు సౌకర్యాలు కూడా కల్పిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో టి డి పి గాజువాక సమన్వయ కర్త ప్రసాదుల శ్రీను,వార్డు అధ్యక్షులు నల్లూరు సూర్యనారాయణ,క్లస్టర్ ఇంచార్జ్ వేగుంట శ్రీనివాస్ రావు , వార్డ్ సెక్రటరీ జగదీష్ , వార్డ్ ఉపాధ్యక్షుడు కొర్లాన రమేష్ , వార్డ్ ఆర్గనైజర్ సెక్రెటరీ నాగార్జున వెంకటేష్ , గాజువాక తెలుగు యువత అధ్యక్షుడు గణపతి , వార్డ్ బిసి సెల్ అధ్యక్షుడు సుబ్బయ్య , వార్డు జనసేన ఇన్చార్జ్ కాదా శ్రీనివాస్, గంధం వెంకటరావు , బీసీ సెల్ సెక్రెటరీ బొబ్బిలి శీను, బాలకృష్ణ,సింహాద్రి నాయక్.

# గజపతినగరంలో జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు

**సమయపాలన లేని ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు**





విజయనగరం టౌన్, పెన్ పవర్, ఏప్రిల్ 02 : జిల్లా కలెక్టర్ ఎస్. రాం సుందర్ రెడ్డి గురువారం గజపతినగరం రెండో నంబర్ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు తీరును పరిశీలించిన కలెక్టర్, విధులకు ఆలస్యంగా వచ్చిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయ పాలన పాటించని సిబ్బందికి వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు. ?అనంతరం సచివాలయ ప్రాంగణాన్ని పరిశీలించి, పరిశుభ్రత పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయ పరిసరాలను అద్దంలా ఉంచాలని, శానిటేషన్పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు సకాలంలో అందాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.

అనంతరం పురిటిపెంట-1 అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడ విధుల్లో ఉండాల్సిన అంగన్వాడీ కార్యకర్త గైర్హాజరు కావడాన్ని గుర్తించి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. చిన్నారుల సంరక్షణ, పౌష్టికాహార పంపిణీలో ఇలాంటి నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. ఈ ఘటనపై తక్షణమే స్పందించి, బాధ్యులైన సి.డి.పి.ఓ, సూపర్వైజర్కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ను ఆదేశించారు. కేంద్రాల నిర్వహణలో పర్యవేక్షణ లోపంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారులతో మమేకమై వారి యోగ క్షేమాలను విచారించారు.

# రాంపురం దోపిడి కేసు పెందుర్తి పోలీసులు ఛేదన

**గంటల్లోనే నిందితుల అరెస్ట్..దోపిడీ సొత్తు స్వాధీనం**

**పెందుర్తి పోలీసుల వేగవంతమైన దర్యాప్తు**



**పెందుర్తి, పెన్ పవర్, ఏప్రిల్ 2 :** స్థానిక పెందుర్తి నియోజకవర్గం, రాంపురం ప్రాంతంలో జరిగిన దోపిడి కేసును పెందుర్తి క్రైమ్ పోలీసులు గంటల వ్యవధిలోనే ఛేదించి నిందితులను అరెస్ట్ చేశారు. ఈ ఘటనలో బాధితుడిపై దాడి చేసి నగదు, సెల్ ఫోన్, ఏటీఎం కార్డు దోచుకున్న ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**లారీ డ్రైవర్పై దాడి – డబ్బులు ఇవ్వకపోతే చంపుతామని బెదిరింపు:**

చినముసిడివాడకు చెందిన లారీ డ్రైవర్ బంటు త్రినాథ్ రావు మార్చి 31న ఉదయం సరుకు దిగజార్చి తిరిగి ఇంటికి వస్తుండగా, రాత్రి సమయంలో రాంపురం సమీపంలో లారీకి డీజిల్ అయిపోవడంతో ఆగిపోయింది. ఆయిల్ కోసం పెట్రోల్ బంక్ వైపు నడుస్తుండగా ఆటోలో వచ్చిన ఇద్దరు వ్యక్తులు అతడిని అడ్డగించి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు లేవని చెప్పడంతో, అతడిని రాళ్లు, ఇనుప కడియాలతో దారుణంగా కొట్టి తలకు గాయపరిచారు. అనంతరం అతని దగ్గరున్న రూ.600 నగదు, సెల్ ఫోన్, ఎస్బిఐ ఎటిఎం కార్డును లాక్కున్నారు. బాధితుడు ప్రాణభయంతో అక్కడి నుంచి తప్పించుకున్న త్రినాథ్ రావు సమీపంలోని పెట్రోల్ బంక్ వద్దకు చేరుకుని సహాయం కోరాడు. అక్కడి వ్యక్తులు అతని బంధువులకు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు చేరుకునేలోపే నిందితులు ఆటోలో పారిపోయారు.

**కేసు నమోదు – వేగంగా దర్యాప్తు:**

ఈ ఘటనపై పెందుర్తి పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెం.132/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి ఆదేశాల మేరకు, డిసిపి క్రైమ్స్ కె.లతామాధురి, ఏసీపీ ఏ.నరసింహమూర్తి పర్యవేక్షణలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు.

**గంటల్లోనే నిందితుల గుర్తింపు – అరెస్ట్:**

క్రైమ్ ఇన్స్పెక్టర్ ఎం.చంద్రమౌళి ఆధ్వర్యంలో ఎస్సై డి.సూరిబాబు బృందం దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించి అరెస్ట్ చేసింది. అరెస్ట్ చేసిన నిందితులు వెలమల మోహనరావు (26), పొన్నాడ వెంకటేష్ (19) దోపిడీ సొత్తు నిందితుల వద్ద నుండి రూ.300 నగదు, సెల్ ఫోన్, ఏటీఎం కార్డు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం సొత్తు విలువ సుమారు రూ.5,300గా అంచనా.

**పోలీసుల ప్రతిభకు ప్రశంసలు:**

ఈ కేసును త్వరితగతిన ఛేదించిన క్రైమ్ ఇన్స్పెక్టర్ చంద్ర మౌళి, ఎస్సై సూరిబాబు మరియు వారి సిబ్బంది పెందుర్తి పి.ఎస్. కె.శ్రీనివాసరావు, జి.నాగరాజు, వి.పెరయ్యనాయుడు, పి.శాంత కుమార్, బి.దేముడునాయుడు, ఎల్.కె.తాతారావులను ఉన్నతాధికారులు అభినందించారు. పోలీసుల సమర్థవంతమైన చర్యలతో నిందితులను తక్షణమే అరెస్ట్ చేయడం స్థానికంగా ప్రశంసలు అందుకుంది.

**ప్రజలకు పోలీసుల సూచనలు :**

రాత్రి వేళల్లో ప్రయాణించే వారు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

# అమరావతే మన రాజధాని





**విశాఖ పశ్చిమలో ఘన సంబరాలు**

**కేక్ కటింగ్తో ప్రారంభమైన వేడుకలు**

**భారీ బైక్ ర్యాలీ -- నినాదాలతో మారుమోగిన వీధులు**

**డబుల్ ఇంజన్ ప్రభుత్వంపై విశ్వాసం**

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఏప్రిల్ 2 :** చారిత్రాత్మక నిర్ణయానికి ప్రజా సంబరం

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని ప్రకటిస్తూ రాజ్యసభలో బిల్లులు ఆమోదం పొందిన సందర్భం రాష్ట్రవ్యాప్తంగా ఆనందోత్సాహాలకు దారి తీసింది. ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని పురస్కరించుకుని విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో సంబరాలు నిర్వహించడం విశేషం. గోపాలపట్నం క్యాంప్ కార్యాలయంలో కార్యక్రమాలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఎమ్మెల్యే గణబాబు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుతూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వేడుకలో పార్టీ శ్రేణులు భారీగా పాల్గొని నినాదాలతో ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోపాలపట్నం నుంచి శ్రీహరిపురం పారిశ్రామిక ప్రాంతం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది కార్యకర్తలు జాతీయ జెండాలతో పాల్గొని

“నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ -- నా రాజధాని అమరావతి” అనే నినాదాలతో ప్రాంతాన్ని కదిలించారు. ఈ ర్యాలీ స్థానిక ప్రజల్లో ఉత్సాహాన్ని నింపింది. సంబరాలు సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీ మరియు రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే గణబాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. వారి ఆశయాలే ఈ విజయానికి ప్రేరణ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ “ఐదు కోట్ల ఆంధ్రుల కల నెరవేరిన రోజు ఇది. అమరావతి కేవలం రాజధాని కాదు, అది రాష్ట్ర ఆత్మగౌరవానికి ప్రతీక” అని అన్నారు. అదే సమయంలో ఆయన కేంద్ర, రాష్ట్ర నాయకత్వాన్ని ప్రశంసిస్తూ నరేంద్ర మోదీ, నారా చంద్రబాబు నాయుడు మరియు పవన్ కళ్యాణ్ తీసుకున్న నిర్ణయాలు చారిత్రాత్మకమని అభివర్ణించారు. అమరావతి అభివృద్ధి వేగవంతం కానుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పరిపాలన మరింత సమర్థవంతం అవుతుందని గణబాబు తెలిపారు. గత కొన్నేళ్ల అనిశ్చితికి ముగింపు పలికే నిర్ణయమిదని పేర్కొన్నారు. రాజకీయ, సామాజిక ప్రభావం రాజకీయంగా అమరావతి నిర్ణయం ప్రాంతీయ భావోద్వేగాలను బలపరిచే అంశంగా మారింది. ఆర్థికంగా అభివృద్ధి కేంద్రీకరణతో పెట్టుబడులు పెరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రజల్లో రాష్ట్ర గుర్తింపు, గర్వభావం పెరుగుతోంది. పాలనాపరంగా ఒకే రాజధాని ద్వారా నిర్ణయాల వేగం పెరగొచ్చు. “నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ -- నా రాజధాని అమరావతి” అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. విశాఖలో జరిగిన ఈ సంబరాలు ప్రజల భావోద్వేగాలను ప్రతిబింబిస్తూ, అమరావతి పట్ల ఉన్న ఆశలు, ఆకాంక్షలను స్పష్టంగా తెలియజేశాయి.





# గ్రామాభివృద్ధికి కృషి చేసిన సర్పంచులకు ఘన కృతజ్ఞతలు

**సవాళ్లను జయించి సేవలందించిన సర్పంచులకు అభినందనలు**

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఏప్రిల్ 2:** రాష్ట్రవ్యాప్తంగా సుమారు 13,350కి పైగా గ్రామపంచాయతీ సర్పంచులు తమ ఐదేళ్ల పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని గురువారం పదవీ విరమణ చేయనున్న సందర్భంగా వారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు జీకే వీధి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, దామనపల్లి గ్రామ సర్పంచ్ కుందేరి రామకృష్ణ.గత ఐదేళ్లలో అనేక సవాళ్లు, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా గ్రామీణాభివృద్ధి కోసం సర్పంచులు అహర్నిశలు కృషి చేసి విశేష సేవలు అందించారని ఆయన పేర్కొన్నారు. కేంద్రం నుంచి నిధులు ఆలస్యంగా అందడం, రాష్ట్ర స్థాయిలో తగిన మద్దతు లేకపోవడం వంటి ప్రతికూల పరిస్థితుల మధ్య కూడా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో రహదారులు, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. గ్రామస్థుల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడంలో సర్పంచులు కీలక పాత్ర పోషించారని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పనిచేసిన వారి సేవలు చిరస్మరణీయమని రామకృష్ణ అన్నారు.సర్పంచుల హక్కుల పరిరక్షణ కోసం తాను కూడా ఉద్యమాలు చేపట్టినట్లు, గత ప్రభుత్వ కాలంలో సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు నిర్వహించి సంఘాన్ని బలోపేతం చేయడానికి కృషి చేసినట్లు తెలిపారు.భవిష్యత్తులో కూడా ఈ ప్రజాప్రతినిధులు సామాజిక సేవలో కొనసాగుతూ ప్రజలకు మార్గదర్శకులుగా నిలవాలని ఆకాంక్షించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎమ్మెల్యేలుగా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులు, సంఘ నాయకులందరికీ మరోసారి శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి భవిష్యత్తు జీవితంలో ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని ఆకాంక్షించారు.



# సీలేరులో వాటర్ ఏరోడ్రోమ్ ప్రాజెక్టుపై గ్రామసభ


**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 2:** అల్లూరి సీతారామరాజు జిల్లాలోని జీకే వీధి మండలం సీలేరు గ్రామంలో ప్రతిపాదిత వాటర్ ఏరోడ్రోమ్ ప్రాజెక్టుపై గురువారం భారీ గ్రామసభ నిర్వహించారు. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొని ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి తిరుమాని శ్రీ పూజ పాల్గొన్నారు. ప్రాజెక్టు ఏర్పాటుపై స్థానిక ప్రజల నుండి సానుకూల స్పందన లభించగా, వారు వ్యక్తం చేసిన సందేహాలకు అధికారులు సమగ్ర వివరణ ఇచ్చారు.వాటర్ ఏరోడ్రోమ్ ఏర్పాటుతో సీలేరు ప్రాంతం పర్యాటక రంగంలో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతుందని, రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని జాయింట్ కలెక్టర్ వివరించారు. ప్రాజెక్టు నిర్మాణ దశలోనూ, అనంతరం పర్యాటక అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని తెలిపారు. పర్యావరణంపై ప్రభావం, భూ సేకరణ వంటి అంశాలపై గ్రామస్తులు అడిగిన ప్రశ్నలకు అధికారులు స్పష్టమైన సమాధానాలు



ఇచ్చారు. స్థానికుల హక్కులకు భంగం కలగకుండా, వారి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టు అమలు జరుగుతుందని హామీ ఇచ్చారు.ప్రభుత్వ లక్ష్యం అభివృద్ధితో పాటు స్థానిక ప్రజలను భాగస్వాములుగా చేసుకోవడమేనని, ఈ ప్రాజెక్టుతో సీలేరు ప్రాంత రూపురేఖలు మారి సమగ్ర అభివృద్ధి



సాధ్యమవుతుందని తెలిపారు. ఈ గ్రామసభలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరిత, తహసీల్దార్ హెచ్. అన్నాజీరావు, జిల్లా పర్యాటక అధికారి దాస్, ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులు, గ్రామ సర్పంచ్ పాంగి దుర్గో, ఎంపీటీసీ సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



## సర్పంచులు మరియు మాజీ మండల వైసీపీ అధ్యక్షులను సన్మానించిన జల్లి సుధాకర్ దంపతులు



**చింత పల్లి,పెన్ పవర్,ఏప్రిల్ 2:** జీకే వీధి మండలం రింతాడా పంచాయతీ పరిధిలోని ఏబులం గ్రామంలో స్వర్ణ గ్రామ సచివాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను కొనియాడారు.ఈ సందర్భంగా సర్పంచ్ బొబ్బిలి లక్ష్మీ వెంకటరావు దంపతులు, అలాగే మాజీ వైసీపీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్‌లను మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్, మెడికల్ బోర్డు మెంబర్, రాష్ట్ర గిరిజన విభాగం ప్రధాన కార్యదర్శి జల్లి హలియా రాణి సుధాకర్ దంపతులు పాల్గొని వారికి సన్మానం చేశారు.ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ, ప్రజలకు నేరుగా సేవలు అందించే విధంగా గ్రామ సచివాలయాల వ్యవస్థను తీసుకువచ్చిన ప్రభుత్వం అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా జగన్ నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో పరిపాలన ప్రజలకు చేరువైందని, సచివాలయాల ద్వారా అనేక సేవలు సులభంగా అందుతున్నాయని ఆయన అన్నారు.

## బొంతలకోడూరు బీసీ హాస్టల్ డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఆకస్మిక తనిఖీ



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. ఏప్రిల్ 02 :**వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ కోసం పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన బొంతలకోడూరులోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల గదులను పరిశీలించిన ఆయన, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వార్డెన్ కి సూచించారు.వసతి గృహంలో మౌలిక సదుపాయాలపై ఆరా తీసిన హరిబాబు, ప్రభుత్వం నిర్దేశించిన దైనందిన ఆహార పట్టిక ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులతో నేరుగా ముచ్చటించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థులకు అవసరమైన న్యాయ సలహాలను అందించారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జి. ఇందిరా ప్రసాద్, వార్డెన్ ఆర్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## విశాఖ రైల్వే స్టేషన్ భద్రతపై కట్టుదిట్ట చర్యలు

### గంజాయి రవాణా అడ్డుకట్టకు సమన్వయ సమావేశం



**విశాఖ ఏప్రిల్ 02 (పెన్ పవర్)**విశాఖపట్నం నగరంలో రైల్వే మార్గాల ద్వారా జరుగుతున్న గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా నిర్మూలించేందుకు నగర పోలీసు శాఖ కీలక చర్యలు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి, ఐపీఎస్ ఆధ్వర్యంలో ఈ రోజు సీపీ ఛాంబర్‌లో ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీఎఫ్ మరియు నగర పోలీసు ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ముఖ్యంగా రైల్వే మార్గాల ద్వారా జరుగుతున్న గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో భద్రతను మరింత బలోపేతం చేయడం, దొంగతనాలు మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం వంటి అంశాలు ప్రాధాన్యతగా చర్చకు వచ్చాయి.

అలాగే, స్టేషన్ వద్ద స్కానింగ్ యంత్రాల ఏర్పాటు, పరిసర ప్రాంతాల్లో పొదలు తొలగింపు, సరైన లైటింగ్ ఏర్పాట్లు, సీసీటీవీ కెమెరాల విస్తరణ వంటి చర్యలను అమలు చేయాలని నిర్ణయించారు. నగరంలోని రైల్వే ఆస్తుల వద్ద కూడా భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులు నిర్ణయించారు.

ఈ సందర్భంగా సీపీ డా. శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీఎఫ్ మరియు లా అండ్ ఆర్డర్ పోలీసు సంయుక్త కార్యాచరణ ప్రణాళికతో పనిచేస్తే గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టవచ్చని పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ పరిధిలో భద్రతను సమర్థవంతంగా నిర్వహించి, ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించాలని సూచించారు.ఈ సమావేశంలో ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీఎఫ్ అధికారులు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణి.

### ముంచంగిపుట్టు మండల టీడీపీ అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ సంధ్య.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఏప్రిల్ 02.** మండలంలో గల మాకవరం పంచాయతీ, అరబీరులో మండల తహసిల్దార్ భాస్కర అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన "మీ భూమి మీ హక్కు" కార్యక్రమం నిర్వహించినట్లు టిడిపి మండల అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ సంధ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మంగళవారం మాట్లాడుతూ.. అరబీరు గ్రామంలో 35 మంది రైతులకు, నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణి చేశామన్నారు. రైతు ఫొటోతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు అందించి రైతుల గౌరవాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెంచారని అన్నారు. భూములు రీ సర్వే పూర్తయిన రైతులకు ప్రభుత్వం శాశ్వత పట్టాలను ప్రభుత్వ రాజ ముద్రతో పాటు క్యూఆర్ కోడ్‌తో ఉన్న పాస్ పుస్తకాలను పారదర్శకంగా ప్రభుత్వం రూపొందించి రైతులకు భరోసా ఇచ్చిందన్నారు. ప్రజా సంక్షేమం రైతుల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఆర్గనైజేషన్ మాజీ సెక్రటరీ పాంగి శాస్త్రి బాబు, టిడిపి అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్



రాణాసింగి నిలకంఠం పాత్రో, నాయకుడు రఘుపతిపడల్, టీడీపీ మాకవరం పంచాయతీ అధ్యక్షుడు కోచో కామరాజు, పార్టీ నాయకులు సిహెచ్ బాబుజి, కోచో గణపతి, సీసా రామదాసు, సీసా రమేష్, డి పులందర్, పాంగి జాగత్రాయ్, లక్ష్మణ్, సీతారాం, ఆర్ఐ కూడ భాస్కర్, సెక్రటరీ లక్ష్మి గ్రామస్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సచివాలయ సిబ్బందిపై ఎమ్మెల్యే అసహనం

- సమయపాలన పాటించని సచివాలయ సిబ్బందిపై చర్యలు తప్పవు.
- కూటమి ప్రభుత్వంలో గిరిజన విద్యార్థులకు కనీస వసతులు కల్పించడంలో విఫలం.
- కర్రిముకిపుట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు గ్రామ సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఏప్రిల్ 02.** సమయపాలన పాటించనీ గ్రామ సచివాలయ సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. ముంచంగిపుట్టు మండల వైసీపీ అధ్యక్షుడు పాంగి పద్మారావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో గల కర్రిముకిపుట్టు గ్రామపంచాయతీ పరిధిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు గ్రామ సచివాలయాన్ని వేరువేరు సమయాలలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ముందుగా అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తనిఖీలో భాగంగా కర్రిముకిపుట్టు గ్రామ




సచివాలయంలో మొత్తం 5 మంది సచివాలయ ఉద్యోగస్తులు ఉండగా సమయం ఉదయం 11గంటలు అవుతున్నా కేవలం ఇద్దరూ మాత్రమే సచివాలయంలో అందుబాటులో ఉండడంతో అసహనం వ్యక్తపరిచారు. ప్రజలకు అందుబాటులో ఉండకుండా, సమయపాలన పాటించని గ్రామ సచివాలయ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేస్తూ.. కఠిన చర్యలు తప్పవని అన్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. గత వైయస్ఆర్ సీపీ ప్రభుత్వం హయాంలో వేలాది పాఠశాలలు నాడు నేడు పేరుతో రూపురేఖలు మార్చామన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుండి విద్యాభివృద్ధికి చేసింది శూన్యమన్నారు. నాడు నేడు కార్యక్రమంలో భాగంగా కర్రిముకిపుట్టు జిల్లా పరిషత్ పాఠశాల భవనం కన్స్ట్రక్షన్ చేయకుండా కేవలం పిల్లర్స్ వేసి అసంపూర్తిగా మధ్యలో ఆపేసి ఉండడంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తపరిచారు. కూటమి ప్రభుత్వంలో గిరిజన విద్యార్థులకు కనీస వసతులు కల్పించడంలో ఫెయిల్ అయిందని అన్నారు. ఈ అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి పాఠశాల భవనాన్ని పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు తెలిపారు. అనంతరం విద్యార్థులకు పలు ప్రశ్నలను అడిగారు. ఈ కార్యక్రమంలో కర్రిముకిపుట్టు గ్రామ పంచాయతీ వైసీపీ నేత గల్లెల అర్జున్, వైసీపీ అరకు నియోజకవర్గం గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు సందడి కొండబాబు, గ్రామ సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చీపురుపల్లిలో తెలుగు తమ్ముల సంబరాలు..



**చీపురుపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 2 ..** అమరావతి రాజధాని గా ఆమోదిస్తూ పార్లమెంట్లో బిల్లు ఆమోదం పొందడంతో చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకటరావుమరియు కిమిడి రామ్ మల్లిక్ నాయుడు సారధ్యంలో చీపురుపల్లిలో గురువారం నాడు ఘనంగా వేడుకలు నిర్వహించారు. చీపురుపల్లి లో వెలసిన శ్రీ శ్రీ శ్రీ కనకమలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రథమ పూజలు నిర్వహించి అనంతరం ర్యాలీగా చీపురుపల్లి పాత బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం చట్టబద్ధతగా అమరావతి బిల్లు ఆమోదం కావడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక మూడు రోడ్ల కూడలిలో సంబరాలు జరుపుకుంటూ కేక్ ని కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రంగా అమరావతి క్యాబినెట్లో బిల్లు ఆమోదం కావడం లో చంద్రబాబు నాయుడు కృషి ఎంతగానో ఉందన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కొరకు విజన్ ఉన్న నాయకుడిగా చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ విప్ గద్దె బాబురావు, తెలుగుదేశం నాయకులు రౌతు కామునాయుడు, చీపురుపల్లి తెలుగుదేశం పార్టీ మాజీ ఇన్ ఛార్జ నేత కుచ్చర్ల పాటి త్రిమూర్తుల రాజు, గవిడి నాగరాజు, ముల్లు రమణ, గరివిడి నాయకులు పైల బలరాం , సారి పాక సురేష్ బాబు,గ్రామీణ ప్రాంత నాయకులు సనపతి శ్రీనివాసరావు, గడే సన్యాసప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్

**గిరిజన సంఘం మండల కార్యదర్శి కే నరసయ్య.**



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఏప్రిల్ 02.** ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేసి కంటి సమస్యతో బాధపడుతున్న వారికి శస్త్ర చికిత్సకు తరలించారు. గిరిజన సంఘం మండల కార్యదర్శి కే నరసయ్య తెలిపిన వివరాల ప్రకారం.. అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండలం, బంగారుమెట్ట పంచాయతీ, మాలగుమ్మి గ్రామంలో మార్చి 17వ తేదీన ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో కంటి సమస్యతో బాధపడుతున్న వాళ్లకు పరీక్షలు చేసి గుర్తించి, వారిని ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి కె నర్సయ్య ఆధ్వర్యంలో 16 మంది కంటి ఆపరేషన్ కు మంగళవారం విజయనగరం పుష్పగిరి ఆసుపత్రికి తరలించారు. ఉచిత కంటి ఆపరేషన్ కు మాలగూమ్మి, సర్భపుట్, మెట్ట బాధిపుట్, లువ్వసింగి గ్రామాల నుండి 16 మందిని తరలించినట్లు గిరిజన సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కె శ్రీను, ఆర్ దేవన్న తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు భూ భరోసా.. వాడమామిడిలో రాజముద్ర పట్టాల పంపిణీ



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఏప్రిల్ 2:** మండలంలోని వాడమామిడి గ్రామంలో రాజముద్ర భూ హక్కు పట్టాల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. జీకే వీధి డిప్యూటీ తహసీల్దార్ దుమంతి సత్యనారాయణ ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు.కూటమి నాయకులు కాకూరి శేఖర్‌రావు, బోండ్ల చిరంజీవి, ముక్కలి మహేష్ చేతుల మీదుగా ఈ పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "మీ భూమి మీ హక్కు" అనే లక్ష్యంతో ప్రభుత్వం భూమిపై ఆధారపడి జీవిస్తున్న రైతుల హక్కులను గుర్తించి, రీ–సర్వే ద్వారా పొరపాట్లను సరిచేసి అధికారికంగా పట్టాలు అందజేస్తోందని తెలిపారు. వాడమామిడి గ్రామంలో మొత్తం 24 మందిలో 21 మందికి రాజముద్ర పట్టాలు అందజేయడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో "భూమి మాది -- పట్టా ప్రభుత్వానిది" అనే పరిస్థితి ఉండగా, ఇప్పుడు "భూమి మాదే -- పట్టా మాదే" అని సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వీఆర్వో వసుపరి లింగాలు, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ చిన్నయ్య పడాల్, సర్వేయర్ ఉమా, వీఆర్ఏ పసుపులేటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా స్వర్ణ గ్రామ సచివాలయం ప్రారంభం

**పదవి ముగించిన సర్పంచులకు ఘన సత్కారం**





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఏప్రిల్ 2:** జీకే వీధి మండలం రింతాడ పంచాయతీ పరిధిలోని ఏబులం గ్రామంలో స్వర్ణ గ్రామ సచివాలయాన్ని గురువారం అట్టహాసంగా ప్రారంభించారు. కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి మరియు ఎంపీపీ బోయిన కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచులు గ్రామాభివృద్ధికి సచివాలయాల ప్రాముఖ్యతను వివరించారు. గ్రామస్థులకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా చేరే విధంగా ఏర్పాటు చేసిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో సాధ్యమయిందని వారు పేర్కొన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా పదవి కాలం ముగించిన సర్పంచుల ఘనతాభివృద్ధి పనులను గుర్తిస్తూ పలువురు సత్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల మాజీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి అరుణ్ కుమార్, పంచాయతీరాజ్ ఏఈ కొయ్యం బాలరాజు,సర్పంచులు వీరేంద్ర ప్రసాద్, ముర్ల కమలమ్మ, కొర్ర సుభద్ర, విరోజీ నాగరాజు, ఎంపీటీసీలు రాజులమ్మ, ఈశ్వరమ్మ, సత్యనారాయణ, కృష్ణమూర్తి, ఉపసర్పంచ్ రాంబాబు, సోమేశ్ కుమార్, వైసీపీ నాయకులు జల్లి సుధాకర్, హోలియా రాణి, వనపల రాజేష్, గణపతి, వెంకట రావు, అలాగే స్థానిక ప్రజా ప్రతినిధులు, సచివాలయం సిబ్బంది, మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సర్పంచుల పదవీకాలం ముగిసినా, వారు గ్రామాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని, భవిష్యత్తులో కూడా వీరు సామాజిక సేవలో కొనసాగుతూ ప్రజలకు మార్గదర్శకులుగా నిలవాలని స్థానికులు అభినందించారు.

# జర్జుల సర్పంచ్ పోర్తిమకు ఘన సన్మానం

**సర్పంచ్ సేవలను కొనియాడిన పంచాయతీ వాసులు.**

**వైసీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు.**

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఏప్రిల్ 02.** మండలంలో గల జర్జుల గ్రామ పంచాయతీ పరిధి గ్రామాల మౌలిక సదుపాయాలు కల్పన అభివృద్ధికి కృషి చేసి ఐదు సంవత్సరాల కాలం పూర్తి చేసుకున్న సర్పంచ్ డి పోర్తిమ, పద్మారావు దంపతులకు స్థానిక ఎంపీటీసీ వంతినిబ విజయలక్ష్మి, పంచాయతీ ప్రజలు, గ్రామ సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గత ఐదు సంవత్సర కాలంలో సర్పంచ్ పదవి బాధ్యతలు చేపట్టి పంచాయతీ పరిధి గ్రామాలలో మంచినీటి సౌకర్యం, సిసి రోడ్లు, డ్రైనేజీలు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ప్రతినిత్యం పంచాయతీ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసేవకు అంకితమయ్యారని, ప్రజల వెన్నంటూ ఉండి ప్రజల కష్టం తెలుసుకొని కష్టంలో తోడునీడగా మెలిగారని పలువురు కొనియాడారు. అనంతరం సన్మాన సభకు ఉద్దేశించి సర్పంచ్ డి పోర్తిమ మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకం పెట్టుకొని సర్పంచ్ గా గెలిపించి పంచాయతీ ప్రజలకు సేవ చేసుకొని భాగ్యం కల్పించిన పంచాయతీ ప్రజలకు, అలాగే పంచాయతీ అభివృద్ధికి, సహకరించిన గ్రామ సచివాలయ సిబ్బంది, అధికారులకు అనాధికారులకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియ జేసుకుంటున్నానని ఆమె అన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, ఉప సర్పంచ్, కె సాధురం, కే నారాయణ , డి దోన లకు కూడ పంచాయతీ ప్రజలు సన్మానం చేశారు. అనంతరం పంచాయితీలకు



రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ప్రత్యేక అధికారులు స్థానిక ఎంపీడీవో ధర్మారావు, డిప్యూటీ ఎంపీడీవోకు స్వాగతం పలుకుతూ దుస్సాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బి రామారావు, కే కృష్ణారావు, జి ప్రసాద్ రావు, పంచాయతీ కార్యదర్శి, జి నీలకంఠంలతో పాటు సచివాలయ సిబ్బంది పంచాయతీ ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చీపురుపల్లిలో తెలుగు తమ్ముల సంబరాలు..



**చీపురుపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 2 ..** అమరావతి రాజధాని గా ఆమోదిస్తూ పార్లమెంట్లో బిల్లు ఆమోదం పొందడంతో చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకటరావుమరియు కిమిడి రామ్ మల్లిక్ నాయుడు సారధ్యంలో చీపురుపల్లిలో గురువారం నాడు ఘనంగా వేడుకలు నిర్వహించారు. చీపురుపల్లి లో వెలసిన శ్రీ శ్రీ శ్రీ



కనకమలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రథమ పూజలు నిర్వహించి అనంతరం ర్యాలీగా చీపురుపల్లి పాత బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం చట్టబద్ధతగా అమరావతి బిల్లు ఆమోదం కావడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక మూడు రోడ్ల కూడలిలో సంబరాలు జరుపుకుంటూ కేక్ ని కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రంగా అమరావతి క్యాబినెట్లో బిల్లు ఆమోదం కావడం లో చంద్రబాబు నాయుడు కృషి ఎంతగానో ఉందన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కొరకు విజన్ ఉన్న నాయకుడిగా చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ విప్ గద్దె బాబురావు, తెలుగుదేశం నాయకులు రౌతు కామునాయుడు, చీపురుపల్లి తెలుగుదేశం పార్టీ మాజీ ఇన్ ఛార్జ నేత కుచ్చర్ల పాటి త్రిమూర్తుల రాజు, గవిడి నాగరాజు, ముల్లు రమణ, గరివిడి నాయకులు పైల బలరాం , సారి పాక సురేష్ బాబు,గ్రామీణ ప్రాంత నాయకులు సనపతి శ్రీనివాసరావు, గడే సన్యాసప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి కేసులో ముగ్గురికి 10 ఏళ్ల జైలు శిక్ష

**చోడవరం కోర్టు సంచలన తీర్పు**

**ఒక్కొక్కరికి రూ. లక్ష జరిమానా**

**అనకాపల్లి, పెన్ పవర్, ఏప్రిల్ 2 :** స్థానిక అనకాపల్లి జిల్లా చీడికాడ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన భారీ గంజాయి రవాణా కేసులో చోడవరంలోని 9వ అదనపు జిల్లా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నేరం రుజువైన ముగ్గురు నిందితులకు కోర్టు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.లక్ష జరిమానా విధించింది. తీర్పు వెలువరించిన న్యాయమూర్తి ఎం.హరి నారాయణ, జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో 2 సంవత్సరాల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని స్పష్టం చేశారు. 2016 అక్టోబర్ 13న చీడికాడ మండలం అప్పలరాజుపురం సమీపంలోని త్రిషింగ్ ఫ్లోర్స్ వద్ద పోలీసులు నిర్వహించిన దాడిలో సుమారు 300 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పాడేరు ఏజెన్సీ ప్రాంతం నుంచి అక్రమంగా గంజాయిని తెచ్చి పది ప్లాస్టిక్ బస్తాలలో నిల్వ ఉంచి తరలించేందుకు సిద్ధమవుతున్న నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిని అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఎస్సై జి.అప్పారావు నేతృత్వంలో పోలీసులు విజయవంతంగా నిర్వహించారు. కోర్టు శిక్ష విధించిన నిందితులు బొట్టా ఈశ్వరరావు (ఏ–1), గోకాడ తాతబాబు (ఏ–5), గోకాడ చెల్లు బాబు (ఏ–6), ఈ ముగ్గురూ చీడికాడ మండలం బైలపూడి గ్రామానికి చెందినవారని పోలీసులు తెలిపారు. నిందితులపై ఎన్డిపిఎస్ చట్టంలోని సెక్షన్ 20(బి)(ఱఱ)(సి) ఆర్/డబల్యు8(సి) కింద నేరం రుజువవడంతో కోర్టు ఈ శిక్ష విధించింది.

పోలీసుల పనితీరుకు ప్రశంసలు ఈ కేసులో ప్రభుత్వ తరఫున వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చీపురుపల్లి సూర్యనారాయణని, కేసును పకడ్బందీగా దర్యాప్తు చేసిన ఎస్సై జి. అప్పారావును, అలాగే చీడికాడ పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రత్యేకంగా అభినందించారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో పోలీసుల కృషిని ఎస్పీ అభినందిస్తూ, కోర్టు ఇచ్చిన కఠిన తీర్పు సమాజానికి హెచ్చరికగా నిలుస్తుందని పేర్కొన్నారు.



# రైతుల వద్దకే రెవెన్యూ వ్యవస్థ

**ఆర్టిసి విజయనగరం జోన్ ఛైర్మన్, టిడిపి అరకు ఇన్చార్జి సియ్యారి దున్నదొర**

**అరకులోయ పెన్ పవర్ 2:** రైతుల వద్దకు రెవెన్యూ వ్యవస్థ తీసుకొచ్చామని,లోతేరు గ్రామపంచాయతీలో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ గ్రామ సభలో ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్, టిడిపి అరకు ఇన్చార్జి సియ్యారి దొన్ను దొర తెలిపారు. అరకులోయ మండలం లోతేరు పంచాయతీ లండిగుడ గ్రామంలో రాజు ముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను గురువారం రైతులకు ఆయన అందించారు. గతంలో పట్టాదారు పాస్ పుస్తకం తీసుకోవాలంటే ప్రతి వ్యక్తికి లంచం ఇస్తే తప్ప మన చేతికి పట్టా వచ్చేది కాదని ఆయన తెలిపారు. రైతుల భూములకు పూర్తిస్థాయి సర్వేతో రాజముద్రతకు ఉన్న పట్టదారు పాసు పుస్తకాలు అందిస్తున్నారనీ, రైతుల భూములకు వారి ఫోటోలతోనే రాజముద్రత కొన్న సమగ్ర సర్వే చేసే పాస్ పుస్తకాలు అందిస్తున్నారన్నారు. ఎన్నికల్లో నారా చంద్రబాబునాయుడు రైతుల భూములు పాస్ పుస్తకాలకు వారి ఫోటోలతో వేసి ఇస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి అందిస్తున్నారన్నారు. చంద్రబాబు ఇచ్చిన మాటతోటే రైతులందరూ ధైర్యం తెచ్చుకొని ఆయనకు మద్దతు తెలిపారని పేర్కొన్నారు. ఒకరి భూమి ఇంకొకరిది అనే మాట వినిపించకుండా భవిష్యత్తులో



ఎటువంటి సమస్యలు పునరావృతం కాకుండా ఈ పాస్ పుస్తకాలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కుమారస్వామి, అరకు మండల అధ్యక్షుడు లోకోయి మహాదేవ్ డుంబ్రిగూడ మండలం అధ్యక్షుడు కిల్లో ఆనందరావు, ఏ.ఏం.సి. చైర్మన్ బొరి బొరి లక్ష్మీ, ప్రధాన కార్యదర్శి పాంగి రాజు. నియోజకవర్గ మహిళ ఉపాధ్యక్షురాలు వంతల ద్రౌపతి. ప్రధాన కార్యదర్శి కిల్లో సిద్దు. లోతేరు సూపర్ ఎంపీటీసీ నోబో, మాజీ ఎంపీటీసీ రామన్న, రెవెన్యూ అధికారులు, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అమరావతికి పట్టిన గ్రహణం వీడింది

- ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత
- 13 వ వార్డులో సంబురాలు జరుపుకున్న టిడిపి కుటుంబ సభ్యులు
- మాజీ కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ.
- వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు.

**విశాఖ తూర్పు,పెన్ పవర్, ఏప్రిల్ 2:** లోక్సభలో అమరావతి రాజధానిగా చట్టబద్ధత కల్పిస్తూ రాజధాని అంశంపై కీలక మలుపు తిరిగిన సంగతి విధితమే. లోక్సభలో అమరావతిని రాష్ట్ర ఏకైక రాజధానిగా గుర్తించే బిల్లును ఆమోదం పొందింది దీంతో గత కొంతకాలంగా కొనసాగుతున్న అనిత్యతకు తెరపడినట్లు భావిస్తున్నారు. రాష్ట్ర విభజన అనంతరం అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని కేంద్రం మరోసారి బలపరిచింది. రైతుల నుంచి సేకరించిన భూములు అభివృద్ధి ఒప్పందాలు చట్టబంగా రక్షించవలసిన అవసరం ఉందని స్పష్టం చేసింది బిల్లుపై చర్చ సందర్భంగా విభిన్న అభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ చివరకు మెజారిటీ ఆమోదం లభించింది కొందరు సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తు సభ నుంచి వాక్ అవుట్ చేయగా మరికొందరు అమరావతికి అభివృద్ధికి మద్దతు తెలిపారు ఈ పరిణామములో అమరావతి రాజధాని చట్టబద్ధతకు మరింత బలం చేకూరగా రాష్ట్ర అభివృద్ధికి దిశగా కొత్త అధ్యయనం ప్రారంభమైనట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిగా గుర్తించిన సందర్భంగా తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు ఆదేశాలతో 13 వ వార్డు తెలుగు తమ్ముళ్లు సంబరాలు చేసుకున్నారు. భారీ ర్యాలీగా సంబరాలు చేసుకుంటూ 13వ వార్డు టిడిపి కార్యాలయం వద్ద పార్టీ వార్డ్ అధ్యక్షుడు ఏడువాక సన్యాసిరావ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు మాజీ కార్పొరేటర్ కల్లా సునీత సత్యనారాయణ అధికార ప్రతినిధి పత్రకొండ ధర్మారావు కార్యదర్శి బాలస్వామి ఉపాధ్యక్షులు జక్కన్న శ్రీనివాస్ పట్టా నూకరాజు ఒడిసెల శ్రీను టిడిపి నాయకులు అడ్డూరి రమణ ఓసెట్టి గురుమూర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## అగ్ని ప్రమాదంలో గడ్డివాము దగ్ధం ...

### సుమారు 60 వేల రూపాయలు నష్టం....

### ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి.....

### రైతు గుడివాడ వెంకటరమణ...




**నాతవరం,పెన్ పవర్ (ఏప్రిల్ 02);** మండల కేంద్రమైన నాతవరం శివారులో గల నాయుడుపాలెం వెళ్లే రహదారి మెట్టిమర్రి వద్ద బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డివాము పూర్తిగా అగ్నికి ఆహుతి అయింది.నాతవరం గ్రామానికి చెందిన గుడివాడ వెంకటరమణ మకాం దగ్గర వేసి ఉన్న గడ్డివాము పూర్తిగా కాలి బూడిదైంది. సుమారు 60 వేల రూపాయలు వరకు నష్టం వాటిలిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ప్రమాదం జరగడానికి గల కారణాలు తెలియలేదని, ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ఈ ప్రమాధం జరిగిందని ఆయన తెలిపారు ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

## పెద్దపాడు గ్రామంలో శ్రమదానంతో చెత్త తొలగింంపు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 2:** రింతాడ పంచాయతీ పరిధిలోని డి.పెద్దపాడు గ్రామంలో గత పదివేళ్లుగా రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను స్థానిక గ్రామస్తుల చొరవతో తొలగించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలో పరిశుభ్రత పునరుద్ధరించబడింది.పెసా సెక్రటరీ పాంగీ కృష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి గ్రామస్తుల బాధ్యత అని స్పష్టం చేశారు. గ్రామ పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచడం ద్వారా ఆరోగ్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ స్వచ్ఛంద శ్రమదాన కార్యక్రమంలో గ్రామ పెద్ద కొర్ర సుబ్బారావు, వార్డ్ నెంబర్ పాంగీ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి రాజధాని ఆమోదంపై ఘన సంబరాలు



**ఉత్తర ఏప్రిల్ 02(పెన్ పవర్):**అమరావతిని రాజధానిగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఉత్తర నియోజకవర్గం బీజేపీ కార్యాలయంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పాల్గొని కార్యాలయం వద్ద టపాసులు కాల్చి, కూటమి నాయకులు మరియు కార్యకర్తలతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమరావతి రాజధానికి లోక్‌సభ మరియు రాజ్యసభల్లో ఆమోదం లభించడం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ ఆనందదాయకమైన విషయమని తెలిపారు.

అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మరియు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అమరావతి రాజధానిగా అభివృద్ధి చెంది దేశంలో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

ఇక గతంలో మూడు రాజధానుల ప్రతిపాదనతో రాష్ట్రం అనిశ్చితిలోకి వెళ్లిందని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ "మావిగన్" వంటి పదజాలం వినిపించడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. ఈ వ్యాఖ్యలు వ్యక్తిగత అభిప్రాయమా లేక సలహాదారుల సూచనలతో వచ్చాయా అన్నది స్పష్టంగా తెలియడం లేదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్, సురేష్ బాబు, శ్యామల దీపికా, ముత్యాల నాయుడు, హనుకు, శంకర్ రావు తదితరులు, బీజేపీ, టిడిపి, జనసేన వార్డు మరియు మండల అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అమరావతి చట్టబద్ధతపై ప్రజల్లో హర్షం

### ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ.



**అరకులోయ పెన్ పవర్ 2:**అమరావతి బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్ ఉభయసభల్లో ఆమోదం పొందడాన్ని హర్షం వ్యక్తం చేస్తూ అరకు పట్టణంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర ఆధ్వర్యంలో గురువారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అమరావతికి జై.... అండగా నిలబడ్డ ఐదు కోట్ల తెలుగు ప్రజలకు థాంక్స్... అంటూ ర్యాలీలో నినదించారు. సియ్యారి దొన్ను దొర మాట్లాడుతూ కలల రాజధాని అమరావతికి మద్దతుగా ఐదు కోట్ల ఆంధ్రులు ఒక్కతాటిపై నిలబడడం శుభసూచకం అన్నారు. అమరావతి కోసం అంతా ఒక్కటే నిలబడి ఉభయ సభల్లో చట్టబద్ధత దక్కేలా మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఐదు కోట్ల ఆంధ్రులు మద్దతు తెలిపిన సరే ఆ ఒక్కడు మావిగన్ జగన్ మాత్రం సిగ్గు లేకుండా వ్యతిరేకించారన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్మిస్తున్న రాజధాని విషయంలో స్మశాన వాటిక అంటూ రకరకాల పేర్లతో పిచ్చిప్రేలాపనలు పేలిన వారందరికీ నోరు మూయించేలా ప్రజలు ముక్తకంఠంతో మద్దతుగా నిలవడం సంతోషదాయకమన్నారు. దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపు నిలబడిందని వైసిపి ఒక్కటే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, రాజధానికి వ్యతిరేకంగా మారిపోయిందన్నారు. ఇది సిగ్గుచేటని ఏపీ అసెంబ్లీలోనూఈ మాదిరిగానే ఉన్నారని ఢిల్లీ పార్లమెంట్ లో కూడా వైసీపీ తీరు ఇలాగే ఉందన్నారు. మూడు ముక్కలాటాడిన జగన్ కు సిగ్గు వచ్చేలా ఆంధ్ర ప్రజలంతా చేశారన్నారు. జగన్ మూడుముక్కలాటల వల్ల ఆంధ్రప్రదేశ్ కు రాజధాని లేకుండా చేయడం వల్ల ఇటీవల జరిగిన ఎన్నికల్లో వారిని 11 సీట్లకే పరిమితం చేసిన ఇంకా బుద్ధి తెచ్చుకో లేదన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే పార్లమెంటు ఉభయ సభలో ఆమోదం పొందిందన్నారు. జగన్ ప్రభుత్వంలో రాజధాని లేక పెట్టుబడుదారులు ఎవరూ ముందుకు రాలేదని ఈరోజు అమరావతి ఆంధ్ర ప్రదేశ్ కు ఏకైక రాజధాని అని తెలియజేస్తూ అమరావతి రాజధాని బిల్లుకు పార్లమెంట్ లో చట్టబద్ధత లభించడంతో ఇకనుంచి పెట్టుబడిదారులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఎంతకాలం ఆంధ్రప్రదేశ్ కు రాజధాని ఏదో స్పష్టత లేక పెట్టుబడిదారులకు నమ్మకం కలగలేదని అన్నారు. చంద్రబాబు నాయుడు అమరావతి నిర్మించి తీరుతారని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే మన కలల రాజధాని ఉండిబోతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు లోకేష్ కు అరకు ఆదివాసీల తరఫున ధన్యవాదాలు తెలిపారు.

# ఒక్క రోజులోనే ఇంటి దొంగతనం ఛేదించిన గోపాలపట్నం పోలీసులు

### త్వరిత దర్యాప్తు -- నిందితుడు అరెస్ట్

### స్వాధీనం చేసుకున్న వస్తువులు




**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, మార్చి 2 :** విశాఖపట్నం, గోపాలపట్నం క్రైమ్ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి, వెంకటాపురం ప్రాంతంలో జరిగిన ఇంటి దొంగతనం కేసును కేవలం ఒకరోజులోనే ఛేధించారు. ఈ ఘటనలో దొంగిలించిన బంగారు ఆభరణాలు మరియు నగదు స్వాధీనం చేసుకొని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. వెంకటాపురం ప్రాంతానికి చెందిన బత్తుల వెంకట ముకుందరావు (69) తన ఇంటిని తాళం వేసి, తాళం చెవిని షూ ర్యాక్‌లో ఉంచి మార్చి 24న బయటకు వెళ్లారు. మార్చి 30న తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి, బీరువాలో ఉంచిన సుమారు 81 గ్రాముల బంగారు గొలుసులు మరియు రూ.35వేలు నగదు కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**త్వరిత దర్యాప్తు -- నిందితుడు అరెస్ట్:**
ఈ ఫిర్యాదు మేరకు మార్చి 31న గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నం.94/2026 కింద కేసు నమోదు చేశారు. పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి ఆదేశాల మేరకు, డిసిపి లతామాధురి, ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. సాంకేతిక ఆధారాలు మరియు పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు, ఓల్డ్ గోపాలపట్నం -- సింహాచలం రైల్వే స్టేషన్ వెనుక ప్రాంతంలో అనుమానితుడు సానాపతి శంకరరావును అదుపులోకి తీసుకున్నారు.

**స్వాధీనం చేసుకున్న వస్తువులు:**

పోలీసుల విచారణలో నిందితుడు నేరాన్ని ఒప్పుకున్నాడు. అతని వద్ద నుండి 42 గ్రాముల నల్లపూసల గొలుసు (లాకెట్‌తో), 33.5 గ్రాముల బంగారు గొలుసు (వెంకటేశ్వర స్వామి, వినాయక లాకెట్‌తో), రూ.35వేలు నగదుతో కొనుగోలు చేసిన ఒప్పో మొబైల్ ఫోన్
మొత్తం సుమారు 80.5 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు.

**ప్రశంసలు అందుకున్న సిబ్బంది:**
ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన అధికారులు మరియు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. వెస్ట్ క్రైమ్ సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్సై జి.తేజేశ్వరరావు,
హెడ్ కానిస్టేబుళ్లు ఎం.గణేశ్వరరావు, కె. అప్పలరాజు, ఎల్. త్రిమూర్తులుకానిస్టేబుల్ ఎస్. శంకరరావు ఉన్నారు. మొత్తం మీద, గోపాలపట్నం పోలీసుల వేగవంతమైన స్పందనతో దొంగతనం కేసు తక్కువ సమయంలోనే పరిష్కారం కావడం విశేషంగా నిలిచింది.

సానాపతి శంకరరావు గతంలో కూడా పలు దొంగతన కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

**ప్రజలకు పోలీసుల సూచనలు :**
ఇలాంటి దొంగతనాలు జరగకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఇంటి నుండి బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా తాళం వేసుకోవాలి
తాళం చెవులను బయట ఉంచకూడదు.
ఇంటి చుట్టూ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. సీసీటీవీ కెమెరాలు నేరాలను గుర్తించడమే కాకుండా, నివారించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయని పోలీసులు తెలిపారు.

# నేరడి బ్యారేజికి లైన్ క్లియర్

### - కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు




**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. ఏప్రిల్ 02 :** వంశధార నదిపై నేరడి బ్యారేజి నిర్మాణానికి సంబంధించి నదీ జలాల ట్రిబ్యునల్ తుది తీర్పు ఇవ్వడం, దానికి అనుగుణంగా కేంద్ర జలశక్తి శాఖ తుది గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం ఆనందంగా ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. వ్యవసాయ ఆధారిత శ్రీకాకుళం జిల్లా భవిష్యత్తుకు ఇది ఒక చరిత్రాత్మక మలుపుగా ఆయన అభివర్ణించారు.
ఈ తీర్పుతో వంశధార నదిపై నేరడి బ్యారేజి, దానికి సంబంధించిన అనుబంధ నిర్మాణాల ఏర్పాటుకు అన్ని ఆటంకాలు తొలగిపోయాయని అన్నారు. ట్రిబ్యునల్.. గొట్టా బ్యారేజి వద్ద వంశధార నది జలల లభ్యతను 115 టీఎంసీలుగా ఖరారు చేయగా, దానిలో సగం నీరు.. రాష్ట్ర ప్రయోజనాలకు ఉపయోగపడనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ సామర్థ్యం గణనీయంగా పెరగనుందని, రైతాంగం తన సాగు నీటి పరిధి విస్తరించి జిల్లాను సస్యశ్యామలం చేసుకునే దిశగా ముందడుగు పడుతుందని రామ్మోహన్ నాయుడు అన్నారు.
ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న ఈ సున్నితమైన, క్లిష్టమైన అంశంలో సమస్య పరిష్కారానికి తాను ఎన్నో ప్రయత్నాలు చేశానని రామ్మోహన్ నాయుడు అన్నారు. పార్లమెంట్ లో, జాతీయ స్థాయి వేదికలలో.. ఇలా ప్రతీ అవకాశాన్ని సమస్య పరిష్కారం కోసం వాడుకున్నామని తెలిపారు. ఆ నమ్మకంతోనే కొద్ది నెలల క్రితం జరిగిన దివంగత ఎర్రంనాయుడు గారి 69వ జయంతిలో సైతం నేరడి బ్యారేజి పూర్తికి స్పష్టమైన హామీ ని ఇచ్చిన్నట్టు రామ్మోహన్ నాయుడు గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా శ్రీకాకుళం జిల్లా ఆర్థికంగా, వ్యవసాయపరంగా మరింత ఉన్నతికి చేరుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలందరి సహకారంతో ప్రాజెక్టును సమర్థవంతంగా, పారదర్శక పద్ధతిలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సుదీర్ఘకాలంగా పోరాడుతున్న ఈ సమస్యపై విజయంలో తోడ్పాటు అందించిన ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రులు, ట్రిబ్యునల్ సభ్యులకు మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# చరిత్రలో నిలచేలా.. అమరావతికి చట్టబద్ధత బిల్లు

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు
- రాజ్యసభలో బిల్లుకు మద్దతుగా కీలక ప్రసంగం చేసిన రామ్మోహన్ నాయుడు.
- అమరావతి రైతుల కష్టాలను గుర్తు చేసుకుంటూ ఉద్విగ్న ప్రసంగం.
- లాఠి దెబ్బలు మోసిన మహిళలకు సాష్టాంగ నమస్కారానికి తెలిపిన కేంద్ర మంత్రి.
- చరిత్రలో నిలచే బిల్లుకు తోడ్పాటు అందించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపిన రామ్మోహన్ నాయుడు.



స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. ఏప్రిల్ 02 : ఒక పవిత్రమైన, శకతివంతమైన నేలపై ఎవరెన్ని కుట్రలు పన్నాలని చూసినా.. అమరావతి విషయంలో ఒక్క ఇటుక కూడా కదల్చలేకపోయారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. గురువారం నాడు రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లును కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ ప్రవేశపెట్టగా.. చర్చకు చైర్మన్ సిపి రాధాకృష్ణన్ అనుమతిని ఇచ్చారు. కొనసాగింపు ప్రసంగాన్ని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేశారు. ఇంకోవైపు రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందిన తీరును రాష్ట్రానికి చెందిన ఎన్డియే ఎంపిలతో కలసి మంత్రి నారా లోకేష్ వీక్షించారు. అంతకుముందు లోక్ సభలో బిల్లుకు మద్దతు ఇచ్చినందుకు ప్రధాని మోదీ తో కూడా భేటి అయ్యి కృతజ్ఞతలు తెలిపారు. చారిత్రాత్మక బిల్లు రాజ్యసభలో అడుగిడిన వేళ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కీలక ప్రసంగాన్ని చేశారు. తెలుగు ప్రజలందరికీ ఇది చారిత్రాత్మకమైన రోజుగా అభివర్ణించారు. చరిత్రలో ప్రజా రాజధానిగా అమరావతి గుర్తుంటుందని చెప్పారు. అమరావతికి చట్టబద్ధత బిల్లు ప్రవేశపెట్టడాన్ని తెలుగు ప్రజలంతా గర్వంగా భావిస్తున్నారని రామ్మోహన్ నాయుడు అన్నారు. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి అలవాటని.. దానికి చట్టబద్ధత కూడా నేడు తోడవ్వడం శుభపరిణామం అని అన్నారు.ఈ సందర్భంగా విభజన సమయంలో జరిగిన విషయాలను కూడా సభ దృష్టికి రామ్మోహన్ నాయుడు తీసుకువచ్చారు. విభజన సమయంలో ఒక రాష్ట్రానికి రాజధాని ఉంది.. మరో రాష్ట్రానికి అలా లేకుండా వదిలేయడంతో సమస్య మొదలైందని అన్నారు. దేశంలో చాలాసార్లు విభజనలు జరిగాయి కానీ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విభజన సమయంలో అనేక ఇబ్బందులు ఎదురయ్యాయని అన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి రూ.16వేల కోట్ల రెవెన్యూ లోటు ఉందని రామ్మోహన్ నాయుడు అన్నారు. అలాంటి సమయంలో 5 కోట్ల మంది ఏపీ ప్రజలు సీఎం చంద్రబాబును తమ కలల రాజధానికి నిర్మాతగా ఎన్నుకున్నారని అన్నారు.తాను ఇప్పుడు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా విమానాశ్రయాల నిర్మాణం కోసం 1000 ఎకరాల భూమిని సేకరించడానికి అనేక ప్రయాసలు పడుతూ ఉంటామని.. కానీ వ్యక్తిపై ఉన్న నమ్మకంతో 30వేలకు పైగా ఎకరాల భూమిని స్వచ్ఛందంగా రైతులు ఇవ్వడం గొప్ప చరిత్ర అని రామ్మోహన్ నాయుడు అన్నారు. ఆ నమ్మకానికి మొదట వంత పాడి.. తరువాత మాట మార్చిన వైసిపి ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో కొత్త నాటకానికి తెరలేపిందని ఎద్దేవా చేశారు. . రాజధాని అమరావతి కోసం ఉద్యమించిన రైతులను తీవ్రంగా హింసించారని, . గర్భిణులు అని కూడా చూడకుండా లాఠీలతో కొట్టించిన హృదయ విదారక ఘటనలు ఎన్నో రాష్ట్రంలో అప్పట్లో చోటు చేసుకున్నాయని గుర్తు చేశారు. అలాంటి కష్టాలను సైతం ధైర్యంగా ఎదుర్కొన్న అమరావతి మహిళలకు సాష్టాంగ నమస్కారం చేస్తున్నా అని రామ్మోహన్ నాయుడు ఉద్విగ్నంగా ప్రసంగించారు.

అమరావతిని రాజధానిగా చేస్తూ పాలన అందిస్తామని 2024 ఎన్నికల్లో ఇచ్ఛాపురం నుండి హిందూపురం వరకు ఒకటే నినాదంతో ఎన్డియే కూటమి ప్రజల్లోకి వెళితే స్పష్టమైన హామీతో మళ్ళీ మాకు అధికారం ఇచ్చారని.. వారి ఆశలు నేడు చట్టబద్ధత బిల్లుతో నెరవేరాయని రామ్మోహన్ నాయుడు అన్నారు. చరిత్రలో నిలచే ఈ బిల్లు చట్టబద్ధతకు తోడ్పాటు అందించిన ప్రతీ ఒక్కరికి రామ్మోహన్ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

# టెంపుల్ సిటీ గా నగర శివారు ప్రాంతం

**ప్రభుత్వ భూములలో ఆలయ నిర్మాణాలకు పక్కా ప్రణాళిక**

**సర్కారు భూములు కాపాడడంలో అధికారుల వైఫల్యం**

**ప్రభుత్వ భూములను ప్రజల అవసరాలకు ఉపయోగించాలంటున్న స్థానికులు**




**విశాఖ తూర్పు,పెన్ పవర్, ఏప్రిల్ 2:**తూర్పు నియోజకవర్గం లాస్ట్ బస్ స్టాప్ సమీపంలో ప్రభుత్వ భూములను కాపాడడంలో అధికార యంత్రాంగం విఫలమవుతున్నారు.ప్రభుత్వ భూములను గుర్తించి వాటిని కాపాడవలసిన అధికారులు ఏమి పట్టినట్టు వ్యవహరిస్తున్నారని ప్రభుత్వ భూములను ప్రభుత్వ,ప్రజల అవసరాల మేరకు ఉపయోగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


గత కొన్ని సంవత్సరాలుగా లాస్ట్ బస్టాప్ వద్ద ప్రభుత్వ భూములను ఆక్రమించి దేవాలయాల నిర్మించడం చర్చనీయాంశంగా మారినప్పటికీ ఇదేమి పట్టని పట్టణ ప్రణాళిక అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.ఇప్పటికే అదే ప్రాంతంలో జగన్నాథ ఉత్కల్ ట్రస్ట్ పేరిట ప్రభుత్వ భూమిని ఆక్రమించి దేవాలయం నిర్మించడం జరిగింది.అదే ప్రాంతంలో కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని స్థానిక ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించుకున్నారు.

ప్రజా ప్రతినిధులు ప్రజా ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ భూములను కాపాడి ఖాళీ ప్రదేశాలను గుర్తించి వాటిలో ప్రభుత్వ భూమిగా బోర్డులను ఏర్పాటు చేయాలని ఈ విషయమే పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకువచ్చినప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టగా పోగా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ భూములను స్వాధీన పరుచుకుని ప్రభుత్వ భూములుగా వాటిని గుర్తింపు బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఇప్పటికే శివాజీ నగర్ 2 ,40 గజాలు ప్రాంతం, ఆరిలోవ కాలనీ లాస్ట్ బస్ స్టాప్ వద్ద ఉన్న నూకాలమ్మ గుడి పరిసర ప్రాంతాలు పబ్లిక్ హెల్త్ సెంటర్ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను అధికారులు స్వాధీనపరచుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వీటి అన్నిటికీ కొసమెరుపు ప్రతి అనధికార నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న నిర్మాణాలు ఆక్రమణలకు స్థానిక శాసనసభ్యులు పేరును ఉపయోగిస్తున్నారు. అనధికార అక్రమ నిర్మాణాలకు స్థానికులు, కొందరు నాయకులు స్థానిక ఎమ్మెల్యే పేరును వాడుతున్నారుఇప్పటికైనా శాసనసభ్యుల పేరును వాడుతున్న వారిపై చర్యలు చేపట్టాలని,వస్తున్న వార్తలపై శాసనసభ్యులు ఖండించకపోవడంతో అక్రమ నిర్మాణ,ఆక్రమణదారులు మరింతగా శాసనసభ్యుల పేరును ఉపయోగిస్తున్నారు.





# విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో మానవ నాగరికతలో పదార్థ పరిశోధన పాత్ర పై నిపుణుల అభిప్రాయం

**కూర్మన్నపాలెం పెన్ పవర్, ఏప్రిల్ 02**

విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆటానమస్ దువ్వాడ, విశాఖపట్నం లోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో, అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజినీర్స్ -- ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణ విభాగం మరియు స్టూడెంట్ సెక్షన్ సహకారంతో మానవ నాగరికతలో పదార్థ పరిశోధన అనే అంశంపై నిపుణుల ఉపన్యాసం విజయవంతంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. కోదండ రామ్ మంగిపూడి, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ భువనేశ్వర్‌లోని మినరల్స్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ హాజరై ఉపన్యాసం అందించారు. ఆయనకు సంస్థ యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు.




తన ప్రసంగంలో ఆయన మానవ నాగరికత అభివృద్ధిలో పదార్థాల ప్రాముఖ్యతను వివరిస్తూ, పురాతన కాలంలోని లోహ వినియోగం నుండి ఆధునిక మెటీరియల్స్ సైన్స్ వరకు జరిగిన పరిణామాలను విశదీకరించారు. అంతేకాకుండా, ఎయిరోస్పేస్, ఎనర్జీ, హెల్త్‌కేర్, మాన్యుఫ్యాక్చరింగ్ వంటి రంగాల్లో పదార్థ పరిశోధన కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. నానో టెక్నాలజీ, స్మార్ట్ మెటీరియల్స్, సస్టైనబుల్ డెవలప్మెంట్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలపై కూడా అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమం విద్యార్థులకు ప్రస్తుత పరిశోధనా ధోరణులు మరియు భవిష్యత్ అవకాశాలపై అవగాహన కల్పించడంలో ఎంతో ఉపయోగపడింది. అనంతరం నిర్వహించిన ప్రశ్నోత్తర కార్యక్రమం విద్యార్థులకు సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం కల్పించింది.

ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులకు, అలాగే విశిష్ట ఉపన్యాసం అందించిన అతిథికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని డీన్ -- ఇంటర్నేషనల్ స్టూడెంట్ అఫైర్స్ డా. సుశాంత్ కుమార్ సాహు సమన్వయం చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. జె. సుధాకర్, రెక్టర్ డా. వి. మధుసూదనరావు, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతులు డా. రాంబాబు మరియు డా. వి. ఆర్. గంగూలి ముఖ్య అతిథిని సత్కరించి, ఆయన అందించిన విలువైన మార్గదర్శకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, విద్యార్థులు పరిశోధనాత్మక అభ్యాసం మరియు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ప్రోత్సహించారు.

## అమరావతికి చట్టబద్ధత బిల్లు ఆమోదం చారిత్రాత్మకం: గంకల కవిత అప్పారావు యాదవ్



**విశాఖ ఏప్రిల్ 02(పెన్ పవర్)**అమరావతిని ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా గుర్తిస్తూ పార్లమెంట్ ఉభయ సభల్లో చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందడం హర్షణీయమని 48వ వార్డ్ మాజీ కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు యాదవ్ తెలిపారు. ఈ నిర్ణయం చారిత్రాత్మకమని, రాష్ట్ర ప్రజల ఎన్నో ఏళ్ల కల సాకారం అయినట్టేనని పేర్కొన్నారు.

అమరావతికి లభించిన ఈ గౌరవం ప్రతి ఆంధ్రుడికి గర్వకారణమని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న కూటమి ప్రభుత్వానికి ఇది కీలక ముందడుగని అభిప్రాయపడ్డారు.రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించడంలో కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, కేంద్ర మంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ఈ బిల్లుకు సహకరించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అమరావతి రాష్ట్ర అభివృద్ధికి కేంద్రబిందువుగా మారి, భవిష్యత్తులో మరింత పురోగతి సాధిస్తుందని గంకల కవిత అప్పారావు యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## సేవలకు గౌరవం,కోరాడ సర్పంచ్ లక్ష్మణరావుకు సత్కారం



**పద్మనాభం, పెన్ పవర్, ఏప్రిల్ 02 :** పద్మనాభం మండలంలోని కోరాడ గ్రామ సచి వాలయంలో గురువారం హృద్యమైన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్‌గా తన పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసిన కోరాడ లక్ష్మణరావును గ్రామస్తులు, ప్రజాప్రతి నిధులు ఘనంగా సత్కరించారు.ఈ సందర్భం గా జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ , మండల పరిషత్ అధ్యక్షుడు ప్రత్యేకంగా పాల్గొని లక్ష్మణరావును శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలతో అభినందించా రు. ఆయన సర్పంచ్‌గా పనిచేసిన కాలంలో గ్రామ అభివృద్ధికి చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు.గ్రామ ప్రజల అవసరాలను గుర్తిం చి, పలు అభివృద్ధి కార్యక్రమాలను విజయవం తంగా అమలు చేయడంలో లక్ష్మణరావు చూ పిన సేవలు ఆదర్శప్రాయమని ఈ సందర్భంగా పలువురు నాయకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక నాయ కులు, వైఎస్సార్సీపీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని లక్ష్మణరావుకు అభినం దనలు తెలియజేశారు.

## అమరావతే ఏకైక రాజధాని... సంఘీభావం తెలిపిన కూటమి నాయకులు.....

**కూటమి నాయకుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ...**




**నాతవరం,పెన్ పవర్ ( ఏప్రిల్ 02):** ఆంధ్రప్రదేశ్ కు అమరావతే ఏకైక రాజధానిగా చారిత్రాత్మకమైన బిల్లును పార్లమెంట్ ఆమోదించిన సందర్భంగా కూటమి నాయకులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించడం జరిగిందని తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రమైన నాతవరంలో బస్టాండ్ నుండి మండల అభివృద్ధి కార్యాలయం వరకు మండల టిడిపి పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో కూటమి నాయకులు తో కలిసి ర్యాలీ నిర్వహించారు.అమరావతే ఏకైక రాజధాని అంటూ ప్లే కార్డులు పట్టుకొని కూటమి నాయకులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కు శాశ్వత రాజధానిగా అమరావతిని పార్లమెంట్ సాక్షిగా ఆమోదించినందుకు మండలంలో గల కూటమి నాయకులు సంఘీభావం తెలిపేందుకు ఈ ర్యాలీ నిర్వహించడం జరిగిందని అన్నారు.ఎటువంటి సైకోలు వచ్చి మూడు రాజధానులు గానో, 30 రాజధానులు గానో చెయ్యకుండా తెలిపేందుకు మేమందరం సంఘీభావం తెలిపే మని, ప్రతి ఒక్కరు సాయంత్రం ఏడు గంటలకు కొవ్వొత్తులు వెలిగించి సంఘీభావం తెలపాలని ఆయన సూచించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద కొవ్వొత్తులు వెలిగించి జై అమరావతిని నినాదాలు చేస్తూ సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం,సత్య శ్రీనివాస్,పిఎసిఎస్ చైర్మన్లు అప్పిరెడ్డి మహాలక్ష్మి, మాణిక్యం, సింగంపల్లి సన్యాసి దేముడు,అంకంరెడ్డి నాని బాబు,మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు,నేతల విజయ్ కుమార్, నర్సీపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెలగా వెంకటకృష్ణారావు,మండల యూత్ అధ్యక్షులు పోలిపర్తి సాయి,మండల మహిళా అధ్యక్షురాలు ఇనపసప్పల సత్య,బిజెపి మండల అధ్యక్షులు సబ్బి కుమారస్వామి, మండల జనసేన యువ నాయకులు బైన మురళి, గ్రామ టిడిపి పార్టీ అధ్యక్షుడు పైల సూరిబాబు, శెట్టి లోవ,మండలంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన టిడిపి అభిమానులు,కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతిని పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదించడం హర్షణీయం



**విశాఖ , ఏప్రిల్ 2.(పెన్ పవర్)**ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతిని ఆమోదిస్తూ దేశ పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదించడం హర్షణీయమని నగరంలోని జీవీఎంసీ 17వ వార్డు టీడీపీ నాయకులు కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. అమరావతి రాష్ట్ర రాజధానిగా పార్లమెంట్ ఆమోదం పొందిన శుభ సందర్భంగా విశాఖ పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు చోడే వెంకట పట్టాభిరాం ఆదేశాల మేరకు విశాఖ తూర్పు నియోజకవర్గం పరిధిలోని 17వ వార్డులో ఆదర్శనగర్ జంక్షన్లో టిడిపి నాయకులు కార్యకర్తలు దీపాలు వెలిగించి సంబరాలు చేసుకున్నారు. జై అమరావతి నినాదాలు చేసి, మిఠాయిలు తినిపించు కున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర రాజధానిగా ఆమోదంతో రాష్ట్ర రాజధాని సమస్య పరిష్కారం అయిందన్నారు. కూటమి ప్రభుత్వ చొరవ తోనే అమరావతి రాష్ట్ర రాజధానిగా ఆమోదం పొందిందన్నారు. అమరావతి రాష్ట్ర రాజధానిగా అభివృద్ధి చెందితే రాష్ట్ర భవిష్యత్తు బంగారుమయం అవుతుం దన్నారు. అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతులకు పూర్తిగా న్యాయం జరిగుతుం దన్నారు. ఈ కార్యక్రమం లో 17వ వార్డు టీడీపీ అధ్యక్షుడు నెక్కంటి సత్యనారాయణ, 18 వ వార్డ్ కన్వీనర్ పూసపాటి రాజు ఆదర్శనగర్ నాయకులు 17వ వార్డు మాజీ కార్పొరేటర్ గేదెల లావణ్య నాగరాజు, రాము , మహేష్, కృష్ణ, లక్ష్మి, రావులమ్మ, వరమ్మ తదితర నాయకులు పాల్గొన్నారు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com